

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 08-07-2025 | సంపుటి - 24 | సంచిక - 65 | రూ : 4 | పేజీలు: 8



## అంతరిక్షం నుంచి ఇస్రో చైర్మన్ తో మాట్లాడిన శుభాంశు శుక్లా

- ప్రస్తుతం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో ఉన్న శుక్లా
- యాక్సియమ్-4 మిషన్‌లో భాగంగా ఐఎస్ఎస్‌లో పరిశోధనలు
- ఆరోగ్యం, మిషన్ పురోగతి, శాస్త్రీయ ప్రయోగాలపై ఇస్రో చైర్మన్ కు వివరణ
- ఈ మిషన్ పరిశోధనలు గగన్‌యాన్‌కు అత్యంత కీలకమని స్పష్టం చేసిన ఇస్రో

2లో

## ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి..
# కేంద్రమంత్రికి కీలక విజ్ఞప్తి!

- ఢిల్లీ పర్యటనలో కేంద్రమంత్రి మన్‌సుఖ్ మాండవీయతో రేవంత్ భేటీ
- తెలంగాణలో జాతీయ క్రీడలు నిర్వహించాలని విజ్ఞప్తి
- 'ఖేలో ఇండియా', '40వ జాతీయ క్రీడలు' రాష్ట్రానికి కేటాయించాలని కోరిక
- క్రీడా వసతుల అభివృద్ధికి నిధులు ఇవ్వాలని మనవి
- క్రీడాకారులకు రైలు ఛార్జీల రాయితీ పునరుద్ధరించాలని డిమాండ్

**జులై 07, ఢిల్లీ :** తెలంగాణలో క్రీడారంగానికి పెద్దపీట వేసే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రయత్నాలు ముమ్మరం చేశారు. తన ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆయన తరువాయి 2లో





## ఐసీసీ సీఈఓగా
## సంజోగ్ గుప్తా నియామకం

- ఐసీసీ నూతన సీఈఓగా ఇవాళ బాధ్యతలు స్వీకరించిన సంజోగ్ గుప్తా
- ప్రపంచవ్యాప్త నియామక ప్రక్రియ ద్వారా ఏకగ్రీవంగా ఎంపిక
- స్టార్ స్పోర్ట్స్ హెడ్‌గా, ఐపీఎల్ వృద్ధిలో కీలక పాత్ర పోషించిన అనుభవం
- ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను చేర్చడమే ప్రధాన లక్ష్యమన్న గుప్తా

2లో

## పేదలందరికీ ...
# ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం



- కేసీఆర్ రూ.కోట్లతో ప్రగతిభవన్ నిర్మించారు.. పేదలకు మాత్రం ఇళ్లు కట్టించలేదు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- హరీశ్‌రావు ఆరోపణలు అర్థరహితం: జూపల్లి

**నాగర్‌కర్నూల్, అమ్రాబాద్, అచ్చంపేట :** ధనిక రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూర్‌లో చెంచులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో కేసీఆర్ రూ.కోట్లతో ప్రగతిభవన్ నిర్మించారని, గులాబీ చొక్కా వేసుకున్నవారికే రెండు పడకగదుల తరువాయి 2లో

## బ్రిక్స్ దేశాలకు ట్రంప్ 'టారిఫ్' హెచ్చరిక..
## స్పందించిన చైనా

- బ్రిక్స్ దేశాలకు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర హెచ్చరిక
- అమెరికాకు వ్యతిరేకంగా వెళ్తే 10 శాతం అదనపు సుంకాలు
- ట్రంప్ ప్రకటనపై వెంటనే స్పందించిన చైనా
- సుంకాల పోరులో విజేతలు ఉండరన్న డ్రాగన్




2లో

## సిగాచీలో అడుగడుగునా ఉల్లంఘనలు..

- కనీస ప్రమాణాలు పాటించని యాజమాన్యం
- తనిఖీల్లో కీలకాంశాలపై కర్మాగారాల విభాగం ఉదాసీనత
- బయటకొచ్చిన 6 నెలల కిందటి నివేదిక



2లో

# టెక్నాలజీతో జీరో క్రైమ్ రేట్ సాధించాలి




- రియల్ టైమ్ గవర్నెన్స్‌పై సీఎం చంద్రబాబు సమీక్ష
- క్రైమ్ హాట్ స్పాట్స్‌పై సీసీ కెమెరాలతో నిరంతర నిఘా
- ప్రభుత్వ రికార్డుల భద్రతకు బ్లాక్ చెయిన్ టెక్నాలజీ
- పిడుగులు పడే ప్రదేశంలో ముందుగానే సైరన్ హెచ్చరికలు

**అమరావతి :** టెక్నాలజీని వినియోగించుకుని జీరో క్రైమ్ రేట్ స్టేట్ గా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు సూచించారు. సాంకేతికత వినియోగించుకుని శాంతి భద్రతల పర్యవేక్షణలో ఆంధ్రప్రదేశ్ ను ఓ మోడల్ రాష్ట్రంగా మార్చాలని స్పష్టం చేశారు. సోమవారం నాడు ఏపీ సచివాలయంలో రియల్ టైమ్ గవర్నెన్స్‌పై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. సీసీ కెమెరాలతో క్రైమ్ హాట్ స్పాట్లపై నిరంతరం నిఘా పెట్టి నేరాల నియంత్రణ చేయాలన్నారు. దీంతో పాటు ప్రైవేటు సీసీ కెమెరాల ఫుటేజి వ్యవహారంలోనూ నిబంధనలు మార్చేలా చర్యలు తీసుకోవాలని తరువాయి 2లో

# పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం

(మొదటిపేజీ తరువాయి)

ఇళ్లు ఇచ్చారని ఆరోపించారు. పేదలకు మాత్రం ఇళ్లు కట్టించలేదని విమర్శించారు. తాము మాత్రం పార్టీలు, మతాలు, కులాల గురించి అడగకుండా పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్లలో రూ.17 వేల కోట్ల రుణమాఫీ చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం పది నెలల్లో రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేసిందని పేర్కొన్నారు. గత సీఎం వరి వేస్తే ఉరి అన్నారని, తమ ముఖ్యమంత్రి సన్నాలకు క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ ఇస్తున్నారని తెలిపారు.

*** ఇళ్ల కోసం ఎవరికీ డబ్బులివ్వొద్దు: జూపల్లి**

రెండు పడకగదుల ఇళ్లు ఇస్తామని కేసీఆర్ మభ్యపెట్టారని మంత్రి జూపల్లి కృష్ణారావు విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రజలు ఎవరికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వనవసరం లేదని స్పష్టం చేశారు. మన్ననూర్‌లో చెంచులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం, అనంతరం అచ్చంపేటలోని క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపణలు చేయడం అర్థరహితమని జూపల్లి కృష్ణారావు అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలపై హరీశ్‌రావు చేసిన ఆరోపణలను ఖండించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉనికి చాటుకోవడానికి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు యత్నిస్తున్నారని విమర్శించారు. ''భారత రాష్ట్ర సమితి ప్రభుత్వ హయాంలో పాలమూరు ప్రాజెక్టులను పట్టించుకోలేదు. కాగితాలపై జిల్లా ఆయకట్టును 4.60 లక్షల ఎకరాలకు పెంచారు తప్ప నీటి విడుదలకు అవసరమైన పనులు చేపట్టలేదు. కాలువల వెడల్పు పెంచకుండా, మోటార్లు ఏర్పాటు చేయకుండా సాగునీరు అందించడం ఎలా సాధ్యం? ప్రస్తుతం ఉన్న ఐదు మోటార్లలో మూడు మాత్రమే పనిచేస్తున్నాయి. మిగతా రెండింటికి మరమ్మతు చేపట్టాలంటే తాగు, సాగునీటి సరఫరా నిలిపివేయాల్సి ఉంటుంది. పాలమూరు ఎత్తిపోతలకు అనుమతులు సాధించి... ఆ నీటిని కేఎల్ఐకి మళ్లించి నాగర్‌కర్నూల్, వనపర్తి, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్ నియోజకవర్గాలకు అందిస్తాం. భారత రాష్ట్ర సమితి హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.లక్ష కోట్లు కేటాయించి... పాలమూరును విస్మరించారు. తప్పుడు ఆరోపణలతో పబ్బం గడుపుకోవాలని చూస్తే సహించేది లేదు'' అని జూపల్లి హెచ్చరించారు. మన్ననూర్ కార్యక్రమంలో అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ మాట్లాడుతూ... ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే తనకు ఫోన్ చేయాలని చెప్పారు. కార్యక్రమాల్లో నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# టెక్నాలజీతో జీరో క్రైమ్ రేట్ సాధించాలి

(మొదటిపేజీ తరువాయి)

సీఎం ఆదేశించారు. నేరాల నియంత్రణకు ప్రైవేటు కెమెరాలను కూడా వినియోగించుకునేలా చూడాలని స్పష్టం చేశారు. రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడే వారి విషయంలో టెక్నాలజీని మరింతగా ఉపయోగించుకోవాలన్నారు. కొందరు తెలివిగా నేరాలు చేసి.. దాన్ని ప్రభుత్వంపై నెడుతున్నారని.. పోలీసులకు సహకరించని వ్యక్తులు, నేతల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని చంద్రబాబు సూచించారు. ఇలాంటి వారి కోసం పబ్లిక్ సేఫ్టీ యాక్టు కింద వారి వద్ద నుంచి డేటాను తీసుకునేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. ఆయా నేరాలకు బాధ్యులుగా చేసే అంశంపైనా దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రజా భద్రత కోసం.. నేరాల కట్టడి కోసం.. దర్యాప్తు నిమిత్తం.. షాపింగ్ మాల్స్, థియేటర్లు, హోటళ్ల వద్ద ఉండే సీసీ కెమెరాల్లోని ఫుటేజీని సేకరించే వంటి వాటి విషయాల్లోనూ పబ్లిక్ సేఫ్టీ యాక్టును వర్తింప చేయాలన్నారు. మరోవైపు వివిధ రంగాల్లో డ్రోన్లు, సీసీ కెమెరాల వినియోగం పెంచాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఓర్వకల్లులో డ్రోన్ సిటీ పురోగతిపైనా అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

*** ప్రభుత్వ రికార్డుల భద్రతకు బ్లాక్ చెయిన్ టెక్నాలజీ**

వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన రికార్డులు, డేటా భద్రతకు బ్లాక్ చెయిన్ టెక్నాలజీని వినియోగించాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రస్తుతం రెవెన్యూ రికార్డులను కూడా పూర్తి స్థాయి ప్రక్షాళన చేసి నూతన సాంకేతికతనే వినియోగించి భద్రంగా ఉండేలా చూడాలన్నారు. వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సమాచారం డేటా లేక్ ద్వారా సమన్వయం చేయాలని సీఎం స్పష్టం చేశారు. మరోవైపు 517 పౌరసేవల్ని వాట్సప్ గవర్నెన్సు ద్వారా అందిస్తున్నట్టు అధికారులు వివరించారు. అయితే అందిస్తున్న సేవలన్నీ యూజర్ ఫ్రెండ్లీగా ఉండేలా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పిడుగులు పడే ప్రాంతాల్లో విలువైన ప్రాణాలు కాపాడటమే లక్ష్యంగా పనిచేయాలని.. ముందస్తు హెచ్చరికల వ్యవస్థ సమర్థంగా పనిచేసేలా చూడాలని సీఎం స్పష్టం చేశారు. ముందుగానే ఆయా ప్రాంతాల్లో సైరన్ మోగేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. భూగర్భ జలాల పర్యవేక్షణకు ఫీజియో మీటర్లు, సెన్సార్లు త్వరితగతిన పునరుద్ధరించాలని అన్నారు. రిజర్వాయర్లలో ప్రస్తుతం ఉన్న నీరెంత, ఎంతమేర ప్రవాహాలు వస్తున్నాయి. సముద్రంలోకి విడుదల చేస్తున్న నీరెంత లాంటి వివరాలు నమోదు చేయాలన్నారు. రిజర్వాయర్లలో వచ్చే ప్రవాహాలకు సంబంధించిన వివరాలను రియల్ టైమ్ లో పర్యవేక్షిస్తే వరద నిర్వహణ చేయొచ్చన్నారు. ప్రస్తుతం వస్తున్న ప్రవాహాలతో రాష్ట్రంలోని అన్ని రిజర్వాయర్లనూ పూర్తి సామర్థ్యంతో నింపుతున్నట్టు సీఎం స్పష్టం చేశారు. మరోవైపు సముద్ర తీరప్రాంతాల్లో అలల ఉధృతి, చేపల వేటకు అవకాశం ఉన్న ప్రాంతాలపై ఇన్ కాయిస్ సంస్థ ఇచ్చే వివరాలను మత్స్యకారులకు, తీరప్రాంతాల్లోని వారికి అందేలా చూడాలని స్పష్టం చేశారు.

*** ప్రజల అవసరాలకు అనుగుణంగా పథకాల రూపకల్పన**

ప్రతీ ప్రభుత్వ శాఖ తమ దగ్గర ఉన్న లబ్ధిదారుల డేటా సహా ఇతర వివరాలను ఆర్టీజీఎస్ తో సమన్వయం చేసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. క్షేత్రస్థాయిలో వ్యత్యాసం ఉంటే తక్షణం ఆర్టీజీఎస్ కు తెలిపి డేటాను సవరించుకోవాలని స్పష్టం చేశారు. 2029 నాటికి పేదరిక రహిత రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దటమే లక్ష్యంగా పనిచేస్తున్నామని అందుకు తగినట్టుగా సంక్షేమ పథకాల రూపకల్పన జరగాలని ముఖ్యమంత్రి అన్నారు. పేదరిక నిర్మూలన కోసం చివరి వ్యక్తి వరకూ చేయూత అందించటమే కూటమి ప్రభుత్వ ఆలోచన అని అన్నారు. పీ4లో భాగంగా బంగారు కుటుంబం మార్గదర్శి అనుసంధాన ప్రక్రియ నిరంతరం కొనసాగాలని సీఎం స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నిర్వహించిన ఈ సమీక్షకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు

# ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. కేంద్రమంత్రికి కీలక విజ్ఞప్తి!

(మొదటిపేజీ తరువాయి)

సోమవారం కేంద్ర క్రీడల శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయతో సమావేశమయ్యారు. తెలంగాణను జాతీయ, అంతర్జాతీయ క్రీడలకు వేదికగా మార్చేందుకు అవకాశం కల్పించాలని ఈ భేటీలో ఆయన కేంద్రమంత్రిని కోరారు. రాష్ట్రంలో 'ఖేలో ఇండియా'తో పాటు ప్రతిష్ఠాత్మకమైన 40వ జాతీయ క్రీడలను నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ విన్నవించారు. ఈ మెగా ఈవెంట్ల నిర్వహణకు తెలంగాణ అన్ని విధాలా సిద్ధంగా ఉందని ఆయన వివరించారు. క్రీడల నిర్వహణకు అవసరమైన శిక్షణ, వసతుల కల్పన కోసం 'ఖేలో ఇండియా' పథకం కింద ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని కోరారు. అదేవిధంగా, జాతీయ క్రీడల్లో పాల్గొనేందుకు వెళ్లే క్రీడాకారులకు గతంలో రైలు ఛార్జీల్లో అందిస్తున్న రాయితీని పునరుద్ధరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనివల్ల దేశవ్యాప్తంగా ఎందరో క్రీడాకారులకు ప్రయోజనం చేకూరుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి విజ్ఞప్తులపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు.

# అంతరిక్షం నుంచి ఇస్రో చైర్మన్ తో మాట్లాడిన శుభాంశు శుక్లా

భారత ప్రతిష్టాత్మక గగన్‌యాన్ మిషన్‌కు కీలకమైన సమాచారాన్ని అందిస్తూ, అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) నుంచి భారత వ్యోమగామి శుభాంశు శుక్లా ఇస్రో ఛైర్మన్ వి. నారాయణన్‌తో మాట్లాడారు. యాక్సియమ్4 (ఏఎక్స్4) మిషన్‌లో భాగంగా ఐఎస్ఎస్‌లో ఉన్న శుక్లా, జూలై 6న ఇస్రో ఛైర్మన్‌కు ఫోన్ చేసి తన ఆరోగ్యం, మిషన్ పురోగతి, నిర్వహిస్తున్న శాస్త్రీయ ప్రయోగాల గురించి వివరించినట్లు ఇస్రో సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ సంభాషణ సందర్భంగా, శుక్లా చేపడుతున్న ప్రయోగాల గురించి ఛైర్మన్ నారాయణన్ ఆరా తీశారు. మిషన్ పూర్తయ్యాక సవివరమైన డాక్యుమెంటేషన్ అందించాల్సిన ఆవశ్యకతను ఆయన నొక్కిచెప్పారు. ఈ మిషన్ నుంచి లభించే పరిశోధనలు, ఫలితాలు భవిష్యత్తులో భారత్ చేపట్టనున్న గగన్‌యాన్ మానవసహిత అంతరిక్ష యాత్రకు అత్యంత కీలకం కానున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ చర్చలో ఇస్రోకు చెందిన పలువురు సీనియర్ అధికారులు కూడా పాల్గొన్నారు. ప్రస్తుతం తాను ఐఎస్ఎస్‌లో నిర్వహిస్తున్న శాస్త్రీయ అధ్యయనాల లక్ష్యాలు, ఎదురవుతున్న సవాళ్లపై శుక్లా వారికి అప్‌డేట్స్ ఇచ్చారు. ఈ మిషన్‌కు ఇస్రో నిరంతరం మద్దతు అందిస్తుందని నారాయణన్ పునరుద్ఘాటించారు. ప్రయోగానికి ముందు శుక్లాకు మార్గనిర్దేశం చేసిన విషయాన్ని గుర్తుచేసుకున్నారు. అదేవిధంగా, మిషన్ సంసిద్ధతలో భాగంగా స్టాండ్‌బై వ్యోమగామిగా ఉన్న ప్రశాంత్ బాలన్ నాయర్‌తో కూడా ఇస్రో అధికారులు నిరంతరం చర్చిస్తున్నట్లు తెలిపారు.

# బ్రిక్స్ దేశాలకు ట్రంప్ 'టారిఫ్' హెచ్చరిక.. స్పందించిన చైనా

బ్రిక్స్ కూటమిలోని దేశాలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గట్టి హెచ్చరిక జారీ చేశారు. అమెరికా వ్యతిరేక విధానాలను అనుసరించే ఏ దేశంపైనైనా సరే 10 శాతం అదనపు టారిఫ్‌లు విధిస్తామని, ఈ విషయంలో ఎలాంటి మినహాయింపులు ఉండవని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం బ్రెజిల్‌లో బ్రిక్స్ దేశాధినేతల శిఖరాగ్ర సదస్సు జరుగుతున్న సమయంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సదస్సులో భారత ప్రధానమంత్రితో పాటు ఇతర సభ్య దేశాల నేతలు అమెరికా సుంకాల విధానాన్ని పరోక్షంగా ప్రస్తావించిన నేపథ్యంలో ట్రంప్ స్పందన వచ్చింది. ట్రంప్ చేసిన తాజా హెచ్చరికలపై చైనా స్పందించింది. సుంకాల యుద్ధంలో ఎవరూ విజేతలుగా నిలవరని, తాము ఘర్షణను కోరుకోవడం లేదని పునరుద్ఘాటించింది. రక్షణాత్మక వాణిజ్య వైఖరి సరైంది కాదని చైనా పేర్కొంది. గతంలో అమెరికాచైనాల మధ్య తీవ్రమైన వాణిజ్య యుద్ధం నడిచినప్పటికీ, ఆ తర్వాత కుదిరిన ఒప్పందంతో అది తాత్కాలికంగా సద్దుమణిగింది. కాగా, బ్రిక్స్ కూటమిపై ట్రంప్ ఇటీవల కూడా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బ్రిక్స్ దేశాలు డాలర్‌తో ఆడుకోవాలని చూస్తే, వాణిజ్యపరంగా వారిని దెబ్బతీస్తానని బెదిరించారు. "నా హెచ్చరికలతోనే బ్రిక్స్ ప్రతిపాదన బలహీనపడింది. ఒకవేళ వారు మాకు వ్యతిరేకంగా ముందుకెళితే 100 శాతం సుంకాలు వేస్తాను. అప్పుడు నా దగ్గరకే వచ్చి వేడుకుంటారు" అని ట్రంప్ ఇటీవల వ్యాఖ్యానించారు. బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికాలతో ప్రారంభమైన బ్రిక్స్ కూటమిలో ఇటీవల ఈజిప్టు, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈలు కూడా సభ్య దేశాలుగా చేరాయి.

# ఐసీసీ సీఈఓగా సంజోగ్ గుప్తా నియామకం

అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) నూతన ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ)గా సంజోగ్ గుప్తా నియమితుల య్యారు. సోమవారం ఆయన దుబాయ్‌లోని ఐసీసీ ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఐసీసీ చరిత్రలో ఈ పదవిని చేపట్టిన ఏడో వ్యక్తిగా ఆయన నిలిచారు. ప్రపంచ క్రికెట్‌ను పరివర్తనాత్మక భవిష్యత్తు వైపు నడిపించేందుకు సంజోగ్ గుప్తాకు స్వాగతం పలుకుతున్నట్లు ఐసీసీ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ నియామకం కోసం ఐసీసీ మార్చిలో ప్రపంచవ్యాప్త ప్రక్రియను ప్రారంభించింది. నామినేషన్స్ కమిటీ పలువురు అభ్యర్థులను పరిశీలించి, చివరికి సంజోగ్ గుప్తా పేరును ఏకగ్రీవంగా సిఫార్సు చేసింది. ఈ సిఫార్సుకు ఐసీసీ ఛైర్మన్ జైషా ఆమోదం తెలపగా, ఐసీసీ బోర్డు దీనిని ధ్రువీకరించింది. "సంజోగ్ గుప్తా నియామకాన్ని ప్రకటించడం సంతోషంగా ఉంది. క్రీడా వ్యూహాలు, వాణిజ్యీకరణలో ఆయనకున్న అపార అనుభవం ఐసీసీకి అమూల్యమైంది. రాబోయే సంవత్సరాల్లో క్రికెట్‌ను ప్రపంచవ్యాప్తంగా విస్తరించాలనే మా ఆశయానికి ఆయన అనుభవం ఎంతగానో దోహదపడుతుంది" అని జైషా తెలిపారు. తన నియామకంపై సంజోగ్ గుప్తా స్పందిస్తూ... "ప్రపంచవ్యాప్తంగా దాదాపు 200 కోట్ల మంది అభిమానులున్న క్రికెట్‌కు సేవ చేసే అవకాశం రావడం గర్వంగా ఉంది. లాస్ ఏంజిల్స్ 2028 ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను చేర్చడం, ఆధునిక టెక్నాలజీని వినియోగించడం ద్వారా క్రీడను మరింత ముందుకు తీసుకెళ్తాను" అని అన్నారు. సంజోగ్ గుప్తా గతంలో జర్నలిస్టుగా తన కెరీర్‌ను ప్రారంభించి, 2010లో స్టార్ ఇండియాలో (ప్రస్తుతం జియోస్టార్) చేరారు. అక్కడ స్పోర్ట్స్ విభాగానికి హెడ్‌గా ఎదిగారు. ఐసీసీ ఈవెంట్లు, ఐపీఎల్ వంటి ప్రతిష్ఠాత్మక టోర్నీలతో పాటు పీకేఎల్, ఐఎస్ఎల్ వంటి దేశీయ లీగ్‌ల విజయవంతంలో ఆయన కీలక పాత్ర పోషించారు.

# నెల్లూరు రొట్టెల పండుగలో పాల్గొన్న మంత్రి నారా లోకేశ్...

- **నెల్లూరులోని ప్రఖ్యాత బారాషహీద్ దర్గాను సందర్శించిన మంత్రి నారా లోకేశ్**
- **మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే రొట్టెల పండుగలో పాల్గొన్న మంత్రి**
- **దర్గాలోని 12 మంది అమరవీరుల సమాధులపై చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు**
- **స్వర్ణాల చెరువులో 'ఆరోగ్యం' రొట్టెను స్వీకరించిన లోకేశ్**
- **పండుగ నిర్వహణకు కూటమి ప్రభుత్వం రూ.10 కోట్లు ఖర్చు చేసిందని వెల్లడి**
- **ఆర్థిక ఇబ్బందులున్నా ఈ వేడుకకు ప్రాధాన్యం ఇచ్చామని స్పష్టం**



రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ నెల్లూరులో జరిగిన ప్రఖ్యాత రొట్టెల పండుగలో పాల్గొన్నారు. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే ఈ వేడుకల కోసం ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, కూటమి ప్రభుత్వం రూ.10 కోట్లు ఖర్చు చేసిందని ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు. సోమవారం నెల్లూరు నగరంలోని బారాషహీద్ దర్గాను లోకేశ్ సందర్శించారు. అక్కడ ఆయనకు ముస్లిం మత పెద్దలు ఘనంగా స్వాగతం పలికి, గలఫ్‌తో సత్కరించారు. అనంతరం, మహ్మద్ ప్రవక్త అనుచరులైన 12 మంది అమరవీరుల చిహ్నాలపై ఆయన చాదర్‌ను కప్పి, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆ తర్వాత, పండుగలో ప్రధాన ఘట్టమైన రొట్టెల మార్పిడి కార్యక్రమంలో భాగంగా లోకేశ్ స్వర్ణాల చెరువు వద్దకు చేరుకున్నారు. అక్కడ భక్తులతో కలిసి 'ఆరోగ్యం' రొట్టెను స్వీకరించారు. రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ పర్యటనకు సంబంధించిన వివరాలను, ఫొటోలను మంత్రి నారా లోకేశ్ తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకున్నారు. ప్రభుత్వం ఈ పండుగకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ఆయన తన ప్రకటన ద్వారా స్పష్టం చేశారు.

# సిగాచీలో అడుగడుగునా ఉల్లంఘనలు..

హైదరాబాద్: సిగాచీ కర్మాగారంలో పేలుడు ఘటనకు భద్రతా ప్రమాణాల వైఫల్యం, అధికారుల ఉదాసీనత వైఖరి ప్రధాన కారణంగా తెలుస్తోంది. 6 నెలలకోసారి కర్మాగారాల విభాగం నిర్వహించే తనిఖీల్లో భవన నిర్మాణ పటిష్ఠతతోపాటు పలు కీలకాంశాలను చూసీచూడనట్లు వ్యవహరించినట్లు కనిపిస్తోంది. ఈ విషయాలపై తనిఖీ నివేదికలో 'బాగున్నాయని, అనుమతులు అవసరం లేదని' పేర్కొనడం గమనార్హం. ఇప్పుడవే ప్రమాదానికి కారణమై 40 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. గతేడాది డిసెంబరు 12న పాశమైలారం పారిశ్రామికవాడ ప్లాట్ నం.20లో ఉన్న సిగాచీ ఇండస్ట్రీస్‌ను కర్మాగారాల విభాగం తనిఖీ చేసింది. ప్రస్తుతం దీనికి సంబంధించిన నివేదిక బయటకొచ్చింది. ఇక్కడ మైక్రో క్రిస్టలైన్ సెల్యులోజ్ పౌడర్, పౌడర్డ్ సెల్యులోజ్‌ను తయారు చేస్తున్నట్లు పేర్కొంది. వీటిని ఫార్మా, ఆహార పరిశ్రమల్లో ముడి పదార్థంగా వినియోగిస్తారు. మండే స్వభావం కలిగి ఉంటాయి. సిగాచీలో మొత్తం 197 మంది పనిచేస్తుండగా.. వీరిలో 110 మంది రెగ్యులర్, 87 మంది ఒప్పంద కార్మికులు ఉన్నారు.

**గుర్తించిన లోపాలు..**

కర్మాగారంలో కార్మికులకు ఏదైనా ప్రమాదం జరిగితే.. చికిత్స చేసేందుకు కనీసం ఫస్ట్‌ఎయిడ్ బాక్సులు లేవు. మిషనరీ హాల్ వద్ద సరైన సంఖ్యలో ఎగ్జిట్ ద్వారాలు లేవని గుర్తించిన కర్మాగారాల విభాగం అన్ని గదుల్లో అగ్నిమాపక అత్యవసర ద్వారాలు ఏర్పాటు చేయాలని తెలిపింది.

# ఎన్నో సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న ఇల్లందు పట్టణ ప్రజల ఆకాంక్ష

*** బుగ్గ వాగు ప్రక్షాళన**





ప్రజాస్ఫూర్తి ఇల్లందు :ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య సహకారం తో 4 కోట్ల రూపాయల తో బుగ్గ వాగు ప్రక్షాళనకు కాంగ్రెస్ ప్రభుత్వం ముందడుగు వేసింది. చేతల్లో అభివృద్ధి చూపిస్తున్న ప్రజల ప్రభుత్వం, ఇల్లందు పట్టణంలోని ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న బుగ్గ వాగు ప్రక్షాళన వేగంగా నడుస్తున్నవిషయంవిదితమే. అభివృద్ధికి అసలైన అర్థం చెప్పినట్లుగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సమస్యను ప్రాధాన్యంగా తీసుకొని ముందడుగు వేసింది. పట్టణాన్ని నీటి ముంపు, దుర్వాసన, మలినాల నుంచి విముక్తి కలిగించే దిశగా బుగ్గ వాగు శుద్ధి కార్యక్రమం ప్రారంభమవడం గర్వకారణం. వర్షాలు ప్రారంభం అయిన సందర్భంగా దిగువ ప్రాంతాలు జలమయం కాకుండా చూడాలని అధికారులకు గౌరవ శాసనసభ్యులు ఆదేశించిన సందర్భంగా రిటైనింగ్ గోడ కోసం తీసిన మట్టిని తొలగించే కార్యక్రమాన్ని దగ్గరుండి పర్యవేక్షిస్తున్న మాజీ మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర రావు. ముఖ్యంగా ఈ ప్రక్షాళన ప్రాజెక్టుకు నిధులు కేటాయించి, పట్టణ అభివృద్ధికి చొరవ చూపిన స్థానిక శాసనసభ్యులు కోరం కనకయ్య కి పట్టణ ప్రజలు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. పెరిగిన వర్షపాతాన్ని దృష్టిలో పెట్టుకొని, బుగ్గ వాగు ప్రవాహాన్ని నిరాటంకంగా జరగగలిగే విధంగా శుభ్రపరిచే ఈ చర్య, పట్టణ ఆరోగ్య భద్రతకు, పర్యావరణ పరిరక్షణకు ఒక గొప్ప ప్రారంభంగా నిలుస్తోంది. పలువురు వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఇలా పేర్కొన్నారు. ఈ వాగు శుభ్రత వల్ల మాకే కాదు, మున్ముందు తరాల ఆరోగ్యానికి బంగారబాట అవుతుంది. వర్షాకాలంలో ముంపు సమస్యకు ఇది మంచి పరిష్కార మార్గం అవుతుందన్నారు.

## వందేళ్ళ మర్రి, తాటి చెట్లను నరికేసి, జీవరాశుల మృతికి కారణమైన వారిపై చర్యలు చేపట్టాలి

*** ప్రజావాణిలో కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన సిసిఎస్**



ప్రజాస్ఫూర్తి, కాప్రా : వందేళ్ల మర్రిచెట్టు నరికివేత, జీవరాశుల మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని చర్లపల్లి కాలనీల సమాఖ్య సిసిఎస్ అధ్యక్షులు ఎంపల్లి పద్మా రెడ్డి కోరారు.సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో చర్లపల్లి కాలనీల సమాఖ్య సిసిఎస్ ప్రతినిధులు జిల్లా కలెక్టర్కు వినతిపత్రం సమర్పించారు.చెట్లను కాపాడాలని అడ్డగోలుగా వృక్షాలను నరికేసి జీవరాశుల మృతికి కారకులైన వారు ఎంతటి వారైనా వదిలిపెట్టొద్దని అటవీ చట్టాల ప్రకారం పెద్ద మొత్తంలో జరిమానాలు విధించి కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని నినదించారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి కాలనీల సమాఖ్య సిసిఎస్ ప్రతినిధులు కొండగళ్ల అశోక్, కందుల సత్యనారాయణ, సత్యనారాయణ రెడ్డి, సత్యనారాయణ, ఉపేందర్, శారదాంబ, సరోజిని, వరలక్ష్మి, రాధిక, సుశీల, శైలజ, విజయ, వాణి తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వైద్యానికి దక్కిన పురస్కారం



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: గత పది సంవత్సరాల నుండి ప్రకృతి వైద్యం ద్వారా పేదలకు ఉచితంగా వైద్యాన్ని అందిస్తున్న హీలర్ జి. సుగుణారావును ప్రజాసంఘాల వేదిక ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి పూల దండలతో సత్కరించి, శాలువాతో ఘనంగా సన్మానించారు. వివిధ రంగాలలో విశేష సేవలు అందించిన వారికి కొత్తగూడెం లోని కొత్తగూడెం క్లబ్లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథి గా వైరా ఎమ్మెల్యే మాలోతు రామ్ దాసు నాయక్, గౌరవ అతిథి భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ప్రజా కవి జయరాజు, ప్రముఖ వైద్యులు వాసిరెడ్డి రమేష్ బాబు, వేదిక కన్వీనర్ జేబి శౌరి, నిర్వహణ కమిటీ సభ్యులు మారపాక రమేష్, యెర్ర కామేష్, కూసపాటి శ్రీనివాస్ అతిధులు బిక్కసాని నాగేశ్వరరావు, ధర్మారావు, నాగ సీతారాములు, మండే వీర హనుమంతరావు, మేదర వెంకట ముత్యం, గడ్డం రాజశేఖర్ తదితరుల చేతుల మీదుగా జ్ఞాపికను అందించారు. ప్రకృతి హరిత దీక్ష సభ్యులు చిన్నారులు నైనిక రజువా , మహమ్మద్ ఆఫాన్ లు మొక్కలను అందించారు. కాగా తొలుత కన్వీనర్ జేబి శౌరి మాట్లాడుతూ.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ప్రకృతి ఆశ్రమాన్ని నిర్వహిస్తూ ఆల్టర్నేటివ్ తెరపిస్టుగా ఉచితంగా వైద్యాన్ని సామాన్యులకు చేరువ చేయడమే కాకుండా సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నందుకు ఎంపిక చేసామని వెల్లడించారు.



## ప్రజా కవులు మాత్రమే ప్రజా చైతన్యం వైపు నడిపించగలరు

*** జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: సామాజిక సమస్యలపై తన కవిత్వం ద్వారా చైతన్యం రగిలించే ప్రజాకవులు సమాజానికి పెద్ద ఆస్థిగా జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అభివర్ణించారు.ఆదివారం రాత్రి కొత్తగూడెం క్లబ్ లో ప్రజా సంఘాల వేదిక ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వ అవార్డు గ్రహీత,ప్రముఖ ప్రజా,ప్రకృతి కవి జయరాజ్ సన్మాన కార్యక్రమం అత్యంత వైభవంగా,ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ హాజరై మాట్లాడారు.సమాజాన్ని చైతన్యం వైపు నడిపించేందుకు కవులు,రచయితలు ఎంతో మానసిక సంఘర్షణలను ఎదుర్కొంటారని పేర్కొన్నారు..అటువంటి వారిని గుర్తించి సత్కరించడం శుభపరిణామం అన్నారు .ఇంత మంచి కార్యక్రమంలో తాను భాగస్వామి కావడం ఆనందంగా ఉందనిచెప్పారు....సన్మానితులుగా గుర్తింపు పొందిన ప్రతీ ఒక్కరూ ఈ ప్రాంత ప్రజలు గర్వపడే విధమైన సేవలు చేస్తున్నారని ప్రశంసించారు.ప్రజాకవి జయరాజ్ తో పాటు వివిధ రంగాలలో విశేష సేవలందించిన మరో 14 మందిని సన్మానితులుగా ఎంపిక చేయడం పట్ల నిర్వాహకులను అభినందించారు..అనంతరం ప్రజా సంఘాల వేదిక కన్వీనర్ జే.బీ.శౌరీ మాట్లాడుతూ జయరాజ్ కేవలం కవి మాత్రమే కాకుండా,సామాజిక ఉద్యమాల యోధులని అన్నారు.ఆయన రాతల్లో ప్రతిఫలించే ప్రకృతి ప్రేమ,అంబేద్కర్ భావజాలం,మహాత్మా జ్యోతిబా పూలే సిద్ధాంతాలు ఈ తరానికి మార్గదర్శకంగా నిలుస్తాయని వివరించారు. సత్కారం పొందిన వారు సామాజిక న్యాయం,సామాజిక సమానత్వం కోసం తమ జీవితాన్ని అంకితం చేసి,ప్రజల్లో చైతన్యం కలిగించడంలో ముఖ్య పాత్ర పోషిస్తున్నారని ప్రశంసించారు..ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ మాట్లాడుతూ ఇంత మంచి కార్యక్రమం ఏర్పాటు చేసిన అంబేద్కర్ వాదులు,సామాజిక ఉద్యమకారులు,ప్రకృతి ప్రేమికులనుఅభినందించారు.. అనంతరం సత్కారం పొందిన సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ ఈ గుర్తింపు తమపై మరింత బాధ్యతను పెంచిందని,సమాజంలో హక్కుల పరిరక్షణ,సామాజిక చైతన్యం కోసం నిరంతరం కృషి చేస్తామని భావోద్వేగంతో ప్రకటించారు...ప్రజాకవి జయరాజ్ మాట్లాడుతూ తనకు లభించిన ఈ సన్మానాన్ని సమాజానికి అంకితం చేస్తూ,సన్మానించిన ప్రజా సంఘాల వేదికకు,ఈ కార్యక్రమానికి హాజరైన ప్రతీ ఒక్కరికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సన్మాన గ్రహీతలు తాళ్లూరి వెంకటేశ్వరరావు,కోచ్ మాస్టర్ షమీ ఉద్దీన్,ఎస్.కె.బాసిత్,కాల్వ దేవదాస్,మొక్కల వెంకటయ్య,వేల్పుల భాస్కర్,ప్రకృతి వైద్యులు సుగుణారావు,కోచైర్మన్ కూసపాటి శ్రీను,బిక్కసాని నాగేశ్వరరావు,యెర్రా కామేష్,మారపాక రమేష్ కుమార్,శనగ.వెంకటేశ్వర్లు, కోచర్ల కమలరాణి,చదలవాడ సురేష్ తదితరులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాంలో పాల్గొన్న అడిషనల్ ఎస్పీ



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు సోమవారం కరకగూడెం పోలీసుల ఆధ్వర్యంలో రేగళ్ల గుత్తికోయ గ్రామంలో కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాంను నిర్వహించారు..ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ జి.నరేందర్ పాల్గొన్నారు.మణుగూరు డిఎస్పీ రవీందర్ రెడ్డి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ గ్రామంలో ప్రతి ఇంటిని పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. అనంతరం గ్రామస్తులందరితో సమావేశమై అక్కడ నివసించే చిన్న పిల్లలకు పలకలు,పుస్తకాలతో పాటు, మహిళలకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. అదేవిధంగా గ్రామంలోని యువతకు వాలీబాల్ కిట్లను కూడా అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా ఓఎస్డి గారు మాట్లాడుతూ మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో నివసించే ఆదివాసి ప్రజలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సారధ్యంలో ఆదివాసీ ప్రజలకు విద్య,వైద్యం,రవాణా వంటి కనీస సౌకర్యాలను అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు.గ్రామంలోకి ఎవరైనా కొత్త వ్యక్తులు ప్రవేశిస్తే వెంటనే పోలీసు వారికి సమాచారం అందించాలని,అదేవిధంగా నిషేధిత మావోయిస్టులకు ఎలాంటి సహాయ సహకారాలు అందించవద్దని గ్రామస్తులకు సూచించారు.గ్రామంలోని పొలం పనులకు వెళ్లే మహిళలకు వర్షాకాలం ఇబ్బంది కలగకుండా ప్లాస్టిక్ రైన్ కోట్స్ ను అందించారు.ఈ కార్యక్రమంలో ఏడూళ్ల బయ్యారం సీఐ వెంకటేశ్వర్లు,కరకగూడెం ఎస్సై పివిఎన్ రావు,పోలీస్ స్టేషన్ సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

## యాదగిరి గుట్ట పుణ్యక్షేత్ర దర్శిని



ప్రజాస్ఫూర్తి, ఇల్లందు : దర్శన భాగ్యము చేతనే సకల పాపములను హరించే పరమ పవిత్రమైన యాదగిరి గుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి మరియు స్వర్ణగిరి వేంకటేశ్వర స్వామి వారి క్షేత్రమునకు జూలై 13న ఆదివారం ఉదయం ఐదు గంటలకు ఇల్లందు డిపో నుండి డీలక్స్ బస్సు ఇల్లందు బస్టాండ్ నుండిబయలుదేరి మహబూబాబాద్, తొర్రూరు, జనగాం మీదుగా యాదగిరి గుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి ని దర్శనం చేసుకుని , స్వర్ణగిరి వెంకటేశ్వర స్వామి దర్శనం చేసుకుని తిరిగి రాత్రి 10 గంటలకు ఇల్లందు చేరుకుంటారు . పెద్దలకు చార్జి.. రూ 840,పిల్లలకు చార్జి రూ 440. ఆన్లైన్ రిజర్వేషన్ కొరకు *TGSRTCBUS.IN సర్వీస్ నెంబర్ 84444... భక్తులందరూ ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని మనవి.మరిన్ని వివరాలకు సంప్రదించగలరు.వేమూరి. నాగరాజు విలేజ్ బస్ ఆఫీసర్, ఇల్లందు.9198661598 29, ఇల్లందు డిపో ఇంచార్జి ఈ. సునీత 9346728893, ఎం. రవీంద్రనాథ్ 9136446666 లను సంప్రదించాలన్నారు.

## ఇల్లందు నియోజకవర్గంలో మంత్రి పొంగులేటి ఎమ్మెల్యే కోరం కనకయ్య పర్యటన



ప్రజాస్ఫూర్తి , ఇల్లందు : ఇల్లందు మున్సిపాలిటికి చెందిన మాజీ వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కొండ్రు భద్రయ్య గత కొద్ధి రోజుల క్రితం మరణించగా ఈరోజు వారి స్వగ్రుహనికి వెళ్ళి కుటుంబ సభ్యులను పరామర్శించి,అండగా ఉంటానని రాష్ట మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రు,ఇల్లందు నియోజకవర్గం శాసన సభ్యులు కోరం కనకయ్య లు హమి ఇచ్చారు. వారి వెంట పాల్గోన్న పొంగులేటి క్యాంప్ కార్యలయం ఇంఛార్జ్ తంబూరు దయాకర్ రెడ్డి ,ఇల్లందు మార్కెట్ కమిటి చైర్మెన్ బానోత్ రాంబాబు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మండల,టౌన్ పార్టీ అధ్యక్షులు పులి సైదులు,దొడ్డా డానియల్, మండల వైస్ ఎంపిపి మండల రాము,మాజీ మున్సిపల్ చైర్మెన్,వైస్ చైర్మెన్ దమ్మాలపాటి వెంకటేశ్వర్లు,యదలపల్లి అనసూర్య,జానీ,టౌన్,మండల పార్టీ కార్యదర్శి అరెం కిరణ్,జాఫర్,నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఈసం లక్ష్మణ్,సొసైటి డైరెక్టర్ కునుసోత్ రాము నాయకులు కాకాటి భార్గవ్,మాజీ ఎంపిటిసి క్రిష్ణ ప్రసాద్,దండుగుల శివ,ఆనంద్,బొల్లి రామారావు,భుక్యా శంకర్,పాయం స్వాతి,కల్తీ పద్మ,టౌన్ మహిళ అధ్యక్షురాలు గాలి స్వరూప నియోజకవర్గం స్థాయి కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గోన్నారు.

## తెలంగాణ రాష్ట్ర బిజెపి నూతన అధ్యక్షుడు రామచంద్రరావుకు శుభాకాంక్షలు



కూకట్ పల్లి, ప్రజాస్ఫూర్తి : తెలంగాణ రాష్ట్ర బిజెపి నూతన అధ్యక్షుడి గా రామచంద్ర రావు నియామకమయ్యారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానంద నగర్ డివిజన్ బిజెపి సీనియర్ నాయకులు భాస్కర్ రెడ్డి ఆయన నివాసంలో మర్యాదపూర్వంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ బిజెపి పార్టీలో రామచంద్ర రావు అంచలంచలుగా ఎదుగుతూ తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడిగా నియామకం కావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. రానున్న స్థానిక ఎన్నికలలో బిజెపి పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తామని అన్నారు.

## ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్స్ పెంచాలి

**- మెరుగైన ఫలితాలను రాబట్టాలి**

**- స్పెషల్ ఆఫీసర్ వి.రమణ రావు**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్స్ పెంచాలని ప్రభుత్వ ఇంటర్ విద్య కమిషనర్ కార్యాలయం నుంచి స్పెషల్ ఆఫీసర్గా వచ్చిన వి.రమణ రావు అన్నారు. ముస్తాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను స్పెషల్ ఆఫీసర్ వి.రమణ రావు, డిఐఇఓ శ్రీనివాస్లు సందర్శించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ వి.రమణ రావు మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల్లో మరింత మెరుగైన ఫలితాలను రాబట్టాలని అన్నారు. విద్యార్థులు డ్రాప్ అవుట్ కాకుండా చూడాలని సూచించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేపట్టాలని సూచించారు. అధ్యాపకులు ఎల్లప్పుడూ విద్యార్థులని, నిరంతరంగా కొత్త విషయాలను తెలుసుకుంటూ పాఠశాలను ప్రిపేర్ అవుతూ బోధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సిహెచ్.కనకలక్ష్మి, విజయరఘునందన్, ఎం.సునీత, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది ఉన్నారు.



# ప్రజా సంక్షేమమే ప్రజా ప్రభుత్వం లక్ష్యం

*** డివైడర్, సెంట్రల్ లైటింగ్ శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానమును టెంపుల్ సిటీగా పాత పూర్వ వైభవంగా తేవడానికి భూ సమస్య ఉండుటవలన దేవస్థానం అభివృద్ధి చేయడానికి జాప్యం జరిగిందని, దేవాలయం మాడవీధుల చుట్టూ ఉన్న ఇంటి యజమానులు సమ్మతించటంతో కావలసిన నిధుల కోసం సీఎం దృష్టికి తీసుకుపోగా వెంటనే నిధులు విడుదల చేయడంతో మాడవీధుల విస్తరణ ప్రక్రియ ప్రారంభమైందని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ సహకార మరియు చేనేత జౌళి శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం మాడవీధుల విస్తరణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం అభివృద్ధి చేయడానికి భూ సేకరణ కోసం ఎన్నో సంవత్సరాల నుండి నివాసం ఉంటున్న మాడ వీధుల ఇంటి యజమానులను ఒప్పించడానికి రెవెన్యూ యంత్రాంగం అహర్నిశలు శ్రమించి ఎంతో కృషి చేసిందని అన్నారు. అందుకు వారిని ప్రత్యేకంగా అభినందిస్తూ, దేవస్థానం అభివృద్ధి నిధుల కోసం ఖమ్మం జిల్లాకు చెందిన తెలంగాణ మంత్రివర్యులు బట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని నియోజకవర్గ శాసనసభ్యులు అందరం కలిసి మంత్రుల దృష్టికి తీసుకొని పోయి వారి ద్వారా సీఎం దృష్టికి తీసుకుపోగా వెంటనే భద్రాచలం దేవస్థానం అభివృద్ధి కొరకు మొదటి విడతగా 33 కోట్ల రూపాయలు విడుదల చేశారని, ఇంకా నాలుగు కుటుంబాలు మిగిలిపోయాయని ,వారికి కూడా నిధులు ఇప్పించి మాడవీధుల విస్తరణ ప్రక్రియ పూర్తి స్థాయిలో చేసి దానికి సంబంధించిన ఫైలును సీఎం దృష్టికి తీసుకొని పోయి, దేవదాయ శాఖ ఆగమ పండితుల ప్రకారము దేవస్థానం అభివృద్ధికి పనులు ప్రారంభిస్తామని అన్నారు. దేవస్థానం అభివృద్ధికి మాడవీధుల విస్తరణ చేయడానికి అక్కడ నివాసం ఉంటున్న కుటుంబాలను జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో, ఆర్డీవో, తాసిల్దార్ సమిష్టిగా కుటుంబాల వారిని ఒప్పించి దేవస్థానం అభివృద్ధికి సహకరించారని అందుకు ఆ కుటుంబాల వారికి ధన్యవాదాలు తెలుపుతూ, జిల్లా అడ్మినిస్ట్రేషన్ కు నష్టం జరగకుండా మాడవీధులలో నివాసం ఉన్న కుటుంబాలకు మంచి జరిగేలా వారికి ఇండ్లు ఇప్పిస్తామని, జీవనోపాధి కొరకు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేసుకోవడానికి అవకాశం కల్పించాలని మాడవీధుల యజమానులు కోరినట్లు తన దృష్టికి వచ్చిందని, తప్పకుండా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి నా తరపున ప్రయత్నాలు చేస్తానని, దేవస్థానం అభివృద్ధికి సహకరించిన ఆ కుటుంబాల వారికి జీవనోపాధి కల్పించడానికి తప్పనిసరిగా ప్రయత్నిస్తానని అన్నారు. అంతకు ముందు భద్రాచలం పట్టణంలోని అంబేద్కర్ సెంటర్లో అంబేద్కర్ సెంటర్ నుండి చర్ల రోడ్డు వరకు స్పెషల్ డెవలప్మెంట్ నిధులతో కోటి 15 లక్షల వ్యయంతో సెంట్రల్ లైటింగ్, డివైడర్లు నిర్మాణం చేపట్టే శిలాఫలకాన్ని ఆయన శంకుస్థాపన చేసి, దేవస్థానం మాడవీధుల విస్తరణ పనులను పరిశీలించి మాడవీధుల పక్కన ఉన్న హోటల్లో జిల్లా అధికారులతో కలిసి టీ తాగుతూ కాసేపు సేద తీరారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటీడీఏ పీవో బి రాహుల్, ఏ ఎస్ పి విక్రాంత్ కుమార్ సింగ్, శిక్షణ కలెక్టర్ సౌరబ్ శర్మ, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, ఆర్డీవో దామోదర్ రావు, భద్రాచలం తాసిల్దార్ జగదీష్ ప్రసాద్, పంచాయతీరాజ్ ఈ ఈ సత్యనారాయణ, డి ఈ ఇర్ఫాన్, ఏఈ శ్రీరామ్, మిషన్ భగీరథ ఏఈఈ రాజారావు, జి పి ఈవో శ్రీనివాస్ , ఇతర శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా ఎంఆర్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు




ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండలం తుర్కపల్లి గ్రామంలో ఎంఆర్‌పిస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు, ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎంఆర్‌పిఎస్ మండల ఉపాధ్యక్షులు జోగేల్లి నాగరాజు మాదిగ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి పంచారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఏర్పడిరదే ఎంఆర్‌పిఎస్ అని, గత 31 ఏళ్లుగా ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఎస్సీ వర్గీకరణ అమలు కోసం చేసిన అలుపెరగని పోరాటం వల్ల అమలు జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు అంకని అశోక్ మాదిగ, మాజీ సర్పంచ్‌లు ఎంఆర్‌పిఎస్ నాయకులు కాశొల్ల దుర్గాప్రసాద్ మాదిగ, అంకని భాను మాదిగ, నాయకులు అంకని ఎల్లం మాదిగ, నగునూరి దుర్గయ్య మాదిగ, జోగెల్లి రాజానర్సు మాదిగ, బోడెల్లి మల్లయ్య మాదిగ, మహేష్ మాదిగ, రాములు మాదిగ, దేవదాస్ మాదిగ, భాను మాదిగ, రామస్వామి మాదిగ, రాజయ్య మాదిగ, చిన్న బాలయ్య మాదిగ, బాలయ్య మాదిగ, కిష్ణ స్వామి మాదిగ, ప్రవీణ్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## జులై 9న జరిగే అఖిల భారత కార్మికుల సమ్మెకు సంపూర్ణ మద్దతు : యుఎస్ఎఫ్ఐ



మేడ్చల్, ప్రజాస్ఫూర్తి : ఈ నెల 9న జరిగే అఖిల భారత కార్మిక సంఘాల సమ్మెకు యుఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా కమిటీ తర Zపున సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా యుఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు చంద్రకాంత్ పత్రిక పట్టణ విడుదల చేశారు అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ చేపట్టిన కార్మిక సంఘాల సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాలను వెంటనే రద్దు చేయాలని అన్నారు.ప్రతి ఒక్కరూ సమ్మెలో పాల్గొని సమ్మెను జయప్రదం చేయవలసిందిగా కోరుతున్నాం.

## బస్తీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

*** పాపిరెడ్డి నగర్ బస్తి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊట్ల చంద్ర రెడ్డి**



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : బస్తీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని పాపిరెడ్డి నగర్ బస్తి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊట్ల చంద్ర రెడ్డి అన్నారు. కూకట్ పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ బస్తీలోని ప్రతి సమస్యను పరిష్కరిస్తూ అన్ని విధాలుగా అభివృద్ధి పరిచేందుకు కట్టుబడి ఉన్నామని బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊట్ల చంద్ర రెడ్డి తెలిపారు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆర్కే పూడి గాంధీ , కూకట్ పల్లి డివిజన్ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ ల సహకారంతో బస్తీలో జరుగుతున్న సిసి రోడ్ నిర్మాణ పనులను సోమవారం స్థానిక నేతలతో కలిసి చంద్రారెడ్డి పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలతో సిసి రోడ్ నిర్మాణ పనులను చేపట్టి సకాలంలో పనులు పూర్తి చేసి ప్రజల అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికార కాంట్రాక్టర్లకు విజ్ఞప్తి చేశారు .కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఆర్ భగవంతు రెడ్డి, కోశాధికారి నర్సింలు ముదిరాజ్, నేతలు వనం ఆంజనేయులు, శ్రీనివాస్ , వీరబాబు, వెంకటేష్ మేస్త్రీ, నరసింహారెడ్డి, భాస్కర్ గుప్తా, డి తిరుపతిరెడ్డి, యాదగిరి, లక్ష్మీనారాయణ, అమర్నాథ్, జగన్ తదితరులు పాల్గొన్నారు




## రోడ్డు అక్రమణపై చర్యలు తీసుకోండి

*** శిరిడిహిల్స్ రోడ్ నెంబర్ 17 లో నిర్మాణంపై ప్రజావాణిలో పిర్యాదు:**

*** ప్రజలకు ఇబ్బంది లేకుండా చుడాలి: సంక్షేమ సంఘం అధ్యక్షులు మహేందర్:**

ప్రజా స్ఫూర్తి, జగద్గిరిగుట్ట:జగద్గిరిగుట్ట డివిజన్ శిరిడీహిల్స్ రోడ్ నెంబర్ 11 లో రోడ్డు ఆక్రమించి చేపడుతున్న అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని శిరిడీహిల్స్ సంక్షేమ సంఘం నాయకులు ప్రజావాణి ద్వారా పిర్యాదు చేసారు. రోడ్డు ఆక్రమణపై సోమవారం గాజుల రామారం డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి ని కలిసి లిఖిత పూర్వకంగా పిర్యాదు చేసారు.సదరు నిర్మాణదారుడు వాహనాల రాకపోకలకు ఇబ్బందికలిగేలా ప్రధాన రహదారిలో రోడ్డుపై నాటిన స్థంబాలను సైతం తొలగించి ఇంటి నిర్మాణం చేపడుతున్నాడని పిర్యాదులో పేర్కొన్నారు.ఎన్నిసార్లు టౌన్ ప్లానింగ్ అధికారులకు పిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని రోడ్డు అక్రమణలపై అధికారులు ఉదాసినంగా ఉంటే ఇంకొందరు నిర్మాణదారులు సైతం రోడ్డు ను ఆక్రమించే అవకాశం ఉందని డీసి దృష్టికి తీసుకెళ్లారు.ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమం లో శిరిడీహిల్స్ సంక్షేమ సంఘం అధ్యక్షులు బండ మహేందర్, నాయకులు ప్రభాకర్ తదితరులు వున్నారు.

## ప్లాస్టిక్ బాటిళ్లు వద్దు.. స్టీల్ బాటిళ్లు ముద్దు..

**– ప్లాస్టిక్ కవర్లను నిషేదిద్దాం.. క్లాత్ కవర్లను వాడుదాం**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:ప్లాస్టిక్ బాటిళ్లలో నీటిని తాగి అనారోగ్యాలకు గురికాకుండా మరియు ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణానికి హాని కలుగకుండా ఉండేందుకు స్టీల్ బాటిళ్లలో నీటిని తాగాలని ప్రకృతి హరిత దీక్షాపరులు నైనిక రజువా, మహమ్మద్ ఆఫాన్ జైదిలు కోరారు. ఈ మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రమైన కొత్తగూడెం క్లబ్‌లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన జయరాజు సన్మాన కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోడీ చే ప్రశంసలు అందుకున్న ప్రకృతి ప్రేమికులు, ప్రకృతి హరితదీక్ష, గ్రీన్ మోటార్ వెహికిల్ గార్డెన్ వ్యవస్థాపకులు, సింగరేణియన్ కొట్టూరు నుర్వి రాజశేఖర్ (మొక్కల రాజశేఖర్) ఆధ్వర్యంలో సబికులకు నైనిక రజువా, ముహమ్మద్ అఫాన్ జైది లు మొక్కలను అందచేశారు. ప్లాస్టిక్‌ని నిషేధించాలంటూ ప్రతి ఒక్కరూ క్లాత్ బ్యాగులను ఉపయోగించాలంటూ జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, సన్మాన గ్రహీత ప్రజాకవి జయరాజు, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ చేతులమీదుగా క్లాత్ బ్యాగులను పంపిణీ చేశారు. అనంతరం ప్రకృతి హరిత దీక్షపరాలు నైనిక రజువా వినూత్నంగా ఒక చేతిలో స్టీల్ బాటిల్.. మరో చేతిలో ప్లాస్టిక్ వాటర్ బాటిల్ పట్టుకొని.. ప్లాస్టిక్ బాటిళ్లలో నీటిని తాగవద్దు.. స్టీల్ బాటిళ్లలో నీటిని తాగడం ముద్దు అంటూ ప్రదర్శించారు.. వీరిద్దరిని జిల్లా కలెక్టర్ జితేష్ వి .పాటిల్, ప్రజా కవి జయరాజు ,ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ లు అభినందించారు.

## తెలంగాణ బార్ కౌన్సిల్ ఎన్నికల బరిలో హైకోర్టు న్యాయవాది నర్రి స్వామి కురుమ



యాదాద్రి భువనగిరి, ప్రజాస్ఫూర్తి : తెలంగాణ సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు లాయర్స్ పోరంపర్ సోషల్ జస్టిస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అఖిల భారతీయ న్యాయవాద సంయుక్త ఆదివాక్త మంచ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మునుగోడు కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం కంటెస్టెండ్ ఎంపీ అభ్యర్థి, హైకోర్టు ప్రముఖ న్యాయవాది నర్రి స్వామి కురుమ చౌటుప్పల్ కోర్టుకు వచ్చిన సందర్భంగా నారాయణపురంలో మీడియాతో మాట్లాడుతూ రాబోయేటటువంటి తెలంగాణ బార్ కౌన్సిల్ ఎన్నికల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు సంబంధించినటువంటి న్యాయవాదిగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని కోర్టు లలో ప్రాక్టీస్ చేస్తూనే న్యాయవాదులకు రక్షణ చట్టాలు కావాలని జూనియర్ కు 5000 ఫెలోషిప్ ఇవ్వాలని అదేవిధంగా అఖిల భారతీయ స్థాయిలో న్యాయవాలు అందరు చైతన్యమై భారత స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్నట్టుగా స్వతంత్ర భారతంలో రాజ్యాధికారాన్ని సాధించినట్లుగా ప్రస్తుతం కూడా న్యాయవాదులందరూ అన్ని పార్టీల్లో కీలకపాత్ర పోషించాలని జాతీయస్థాయిలో ఉద్యమాలు చేస్తున్నాం కాబట్టి ముఖ్యంగా ఉమ్మడి నల్గొండ జిల్లాలోని ప్రతి న్యాయవాది మీ యొక్క అమూల్యమైనటువంటి ఓటుని మీ ఉమ్మడి నల్గొండ ముద్దుబిడ్డ నిరంతరం రాజకీయ చైతన్య కోసం పోరాటం చేసే హైకోర్టు న్యాయవాది నర్రి స్వామికి నీ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించి మీ న్యాయవాదుల సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా కృషి చేయడానికి అవకాశం కల్పిస్తారని కోరుకుంటున్నాను అని తెలియజేశారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నాగుల శ్రీనివాస్ యాదవ్, దయ్యాల మానిక్, మహేష్ బాబు కురుమ, గురువయ్య గౌడ్, మల్లేష్ యాదవ్, తెలంగాణ సామాజిక చైతన్య నాయకులు కొల్ల మహేష్ ముదిరాజ్, కుర్ర సాగర్ నాయక్, అనేకమంది కార్యకర్తలు పాల్గొన్నారు

## ప్లాస్టిక్ బాటిళ్లు వద్దు.. స్టీల్ బాటిళ్లు ముద్దు..

**– ప్లాస్టిక్ కవర్లను నిషేదిద్దాం.. క్లాత్ కవర్లను వాడుదాం**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:ప్లాస్టిక్ బాటిళ్లలో నీటిని తాగి అనారోగ్యాలకు గురికాకుండా మరియు ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణానికి హాని కలుగకుండా ఉండేందుకు స్టీల్ బాటిళ్లలో నీటిని తాగాలని ప్రకృతి హరిత దీక్షాపరులు నైనిక రజువా, మహమ్మద్ ఆఫాన్ జైదిలు కోరారు. ఈ మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రమైన కొత్తగూడెం క్లబ్‌లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన జయరాజు సన్మాన కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోడీ చే ప్రశంసలు అందుకున్న ప్రకృతి ప్రేమికులు, ప్రకృతి హరితదీక్ష, గ్రీన్ మోటార్ వెహికిల్ గార్డెన్ వ్యవస్థాపకులు, సింగరేణియన్ కొట్టూరు నుర్వి రాజశేఖర్ (మొక్కల రాజశేఖర్) ఆధ్వర్యంలో సబికులకు నైనిక రజువా, ముహమ్మద్ అఫాన్ జైది లు మొక్కలను అందచేశారు. ప్లాస్టిక్‌ని నిషేధించాలంటూ ప్రతి ఒక్కరూ క్లాత్ బ్యాగులను ఉపయోగించాలంటూ జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, సన్మాన గ్రహీత ప్రజాకవి జయరాజు, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ చేతులమీదుగా క్లాత్ బ్యాగులను పంపిణీ చేశారు. అనంతరం ప్రకృతి హరిత దీక్షపరాలు నైనిక రజువా వినూత్నంగా ఒక చేతిలో స్టీల్ బాటిల్.. మరో చేతిలో ప్లాస్టిక్ వాటర్ బాటిల్ పట్టుకొని.. ప్లాస్టిక్ బాటిళ్లలో నీటిని తాగవద్దు.. స్టీల్ బాటిళ్లలో నీటిని తాగడం ముద్దు అంటూ ప్రదర్శించారు.. వీరిద్దరిని జిల్లా కలెక్టర్ జితేష్ వి .పాటిల్, ప్రజా కవి జయరాజు ,ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ లు అభినందించారు.

## చౌటుప్పల్ లో ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం బస్టాండ్ ఆవరణలో ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భవ దినోత్సవం, మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ లింగస్వామి మాదిగ పాల్గొని, ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరించారు. మందకృష్ణ మాదిగ జన్మదినాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా బోయ లింగస్వామి మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం అంటే మాదిగలకు ఒక పండుగ రోజు అన్నారు. మందకృష్ణ మాదిగ ఒక సామాజిక న్యాయం కోసం, అసమానతలను రూపుమాపడం కోసం, భవిష్యత్ తరాల కోసం 31ఏళ్ల సుదీర్ఘమైన వర్గీకరణ పోరాటం చేశారన్నారు. ఆ పోరాటంలో విజయం సాధించి ఆ ఫలితాలను భవిష్యత్తు తరాలకు అందించారన్నారు. వృద్ధులు, వితంతువులకు ఆసరా, ఆరోగ్యశ్రీ ద్వారా ఎంతోమంది నిరుపేదలకు ఉచిత వైద్యాన్ని అందేలా పోరాటాల నిర్వహించారన్నారు. సమాజంలో అణగారిన వర్గాలకు ఎక్కడ అన్యాయం జరిగినా నేనున్నానంటూ అలుపెరగని పోరాటం చేసి పద్మశ్రీ సాధించిన గొప్ప వ్యక్తి మందకృష్ణ మాదిగ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు బోయ రామచందర్, బోయ దేవేందర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయ వెంకట్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బొడ్డు శ్రవణ్ కుమార్, మాజీ సర్పంచ్ లు అల్మాస్ పేట కిష్టయ్య, ఊదరి నరసింహ, ఊదరి వెంకటేష్ మహాజన్, సుక్క అర్జున్, కట్టెలు లింగస్వామి, బోయ రాము, ఊదరి శ్యాంసుందర్, ఆరుట్ల లింగస్వామి, ఎర్ర గౌతమ్, ఎర్ర శంకర్, బోయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అమ్మల్లాంటి మహిళల కోసం.. అండగా ఉంటా

* మహిళల కమిట్మెంట్ చాలా గొప్పది
* మహిళలు రాణించని రంగం లేదు
* ఉచితకుట్టు శిక్షణ సర్టిఫికెట్ల పంపిణీ
* మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి






చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: కుటుంబాల కోసం జీవితాన్ని త్యాగం చేసే అమ్మల్లాంటి మహిళలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ పరిధి లక్కారంలోని ఎస్ ఎం ఆర్ ఫంక్షన్ హాల్ లో మదర్ ఎడ్యుకేషన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కుట్టు శిక్షణ సర్టిఫికేట్ల పంపిణీ కార్యక్రమంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికేట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో తల్లి ప్రేమకు మించినదేదీ లేదన్నారు. మహిళలు యుద్ధ విమానాలు నడుపుతున్నారు. యుద్ధాల్లో పాల్గొంటున్నారన్నారు. వారికి అవసరమయ్యే సమయంలో నేను అండగా నిలుస్తానన్నారు. మహిళల పట్ల హింసకు, అన్యాయాలకు సమాజంలో స్థానం ఉండకూడదని, భర్త తప్పు చేస్తే ధైర్యంగా నిలదీయాలని, వినకపోతే తనకు చెప్పాలన్నారు. మహిళలు తమ భర్తల వైఖరిని మార్చే శక్తి కలిగి ఉండాలన్నారు. కుటుంబం యొక్క విలువను అర్థం అయ్యేలాగా చెప్పగలిగితే మార్పు సాధ్యమేనని తెలిపారు. ఈ శిక్షణలో 67శాతం మహిళలు పాల్గొనేట్లు సహకరించిన సంధ్యా రెడ్డి సేవలు అభినందనీయమన్నారు. మహిళలు ఉచితాలు కోరడం లేదని, మునుగోడు నియోజకవర్గంలో బెల్ట్ షాపులను మూసివేత నిర్ణయంతో మహిళలు సంతోషంగా ఉన్నారన్నారు. తన తల్లి పేరుతో ఏర్పాటు చేసిన కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ద్వారా రూ.15కోట్లతో వృద్ధాశ్రమాన్ని నిర్మించానని, కోవిడ్ సమయంలో కోట్లాది రూపాయల విలువైన నిత్యావసర సరుకులను పంపిణీ చేశానన్నారు. విద్యలో ప్రతిభ చూపిన విద్యార్థులకు రూ.25లక్షల నగదు బహుమతులు అందించామన్నారు. వలిగొండ రోడ్డులోని ఒక ఎకరం భూమిని స్కిల్ డెవలప్మెంట్ కేంద్రం కోసం కేటాయించామని, అవసరమైతే రూ.5 కోట్లు ఖర్చు చేసి భవనం నిర్మిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మదర్ ఎడ్యుకేషన్ సొసైటీ సభ్యులు, మహిళలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై బిజెపి నేత వడ్డేపల్లి రాజేశ్వరరావు పర్యటన



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : అల్లాపూర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై, డివిజన్ లోని బిజెపి సంస్థాగత విషయాలపై బిజెపి రాష్ట్ర ఓబీసీ మోర్చా నాయకులు పులిగోళ్ళ శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశం నందు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డివిజన్ లోని కాలనీ అధ్యక్షులు బస్తీ కమిటీ అధ్యక్షులు రోడ్లు డ్రైనేజీల వ్యవస్థ సరిగ్గ లేదన్నారు. నూతన కమిటీ హాల్ నిర్మాణం చేపట్టాలని, కొత్త బోర్వెల్ వేయించి నీటి సమస్య తీర్చాలని, స్మశాన వాటికల అభివృద్ధి చేయాలని ఇలా పలు సమస్యలను వడ్డేపల్లి రాజేశ్వరరావు కి తెలియజేశారు, అనంతరం వారు మాట్లాడుతూ ఈ రాష్ట్ర ప్రభుత్వం యొక్క వైఫల్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాటిని స్థానిక ఎంపీ ఈటెల రాజేందర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని తెలియజేశారు, తదనంతరం డివిజన్ లోని నాయకులు కార్యకర్తలు అందరూ కలిసి సమిష్టిగా పనిచేసి పార్టీ యొక్క పటిష్టతకు కృషి చేయాలని రాష్ట్ర పార్టీ ఇచ్చేటువంటి కార్యక్రమాలు అన్నిటిని విజయవంతం చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు విజయ్, డివిజన్ నాయకులు వెంకటరామిరెడ్డి,మోహన్ గౌడ్,శర్మ,శ్రావణ్, అంకిత్ సింగ్ స్థానిక ప్రజలు,బిజెపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం, ప్రభుత్వ సంస్థల ప్రవేటికరణను వెంటనే ఆపాలి

* సీఐటీయూ, ఏఐటీయూసీ, ఏఐసిటియు వామపక్ష కార్మిక సంఘాలు



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి ) : కేంద్ర ప్రభుత్వం, ప్రభుత్వ సంస్థల ప్రవేటికరణను వెంటనే ఆపాలని సీఐటీయూ, ఏఐటీయూసీ, ఏఐసిటియు వామపక్ష కార్మిక సంఘాలు కోరారు. జులై 9 దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని వామపక్ష కార్మిక సంఘాలు ఏఐటీయూసీ, సీఐటీయూ, ఎఐసిటియు ఆధ్వర్యంలో నిజాంపేట కార్పొరేషన్ ప్రగతి నగర్ సుందరయ్య భవన్ నందు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటియుసి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నాయకులు పాలబిందెల.శ్రీనివాస్ ,సిఐటియు జిల్లా నాయకులు జీ. వెంకటరాజ్యం ఏఐసిటియు మండల నాయకులు పీ.దస్తగిరి మాట్లాడుతూ కార్మిక వర్గం సమస్యల పోరాటాల ద్వారా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్లను బిజెపి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చినద న్నారు.. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనాల కోసం కార్మికులకు అన్యాయం చేస్తున్నారు అని అన్నారు. కార్పొరేట్ సంస్థల లాభాల కోసం 8 గంటల పని దినాన్ని 10 గంటలకు పెంచుతూ తెలంగాణ ప్రభుత్వం తీసుకు వచ్చిన జీవో నెంబర్ 282, కార్మికుల శ్రమ దోపిడీకి గురి చేస్తున్న దన్నారు.జిఓ నెం. 282 ను వెంటనే రద్దు చేయాలనీ వారు డిమాండ్ చేశారు. అనంతరం జిఓ నెం. 282 కాపీలను దగ్ధం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మున్సిపల్ నాయకులు పీ. పెంటయ్య, బాలవేంకటేశ్వర్ రావు, నాగభూషణం, రాదా కృష్ణ, రవి కుమార్, ఏఐటీయూసీ నాయకులు బోయ.కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీ డిక్లరేషన్ పేరుతో రైతులను వంచించింది

* బీజేపీ పట్టణ అధ్యక్షులు కర్రే ప్రవీణ్

యాదగిరిగుట్ట ప్రజాస్ఫూర్తి : యాదగిరిగుట్ట పట్టణంలో తాసిల్దార్ కి బిజెపి ఆధ్వర్యంలో రైతు సమస్యల పైన వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు కర్రే ప్రవీణ్ , మాట్లాడుతూ రైతు ప్రభుత్వం అని చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ డిక్లరేషన్ పేరుతో రైతులను వంచించింది తప్ప వాళ్లకి ఇలాంటి మేలు చేయలేదు రుణమాఫీ చేస్తానని చేయకుండా రైతులను బ్యాంకులో చుట్టూ తిప్పుతున్నారు రైతు భరోసా కూడా చాలామందికి పడలేదు ఎకరం భూమి ఉంటే రెండు గుంటలకు మాత్రమే రైతు భరోసా అందింది కౌలు రైతులకు సహాయం ఇంతవరకు అందలేదు సన్నాలకు ఇస్తానన్న బోనస్సు లేదు యూరియా కేంద్రం అందిస్తున్న కూడా సరిగా పంపిణీ చేయకుండా రైతులను ఇబ్బంది పెడుతున్నారు నీళ్ల ఐలయ్య గా చెప్పుకునే స్థానిక ఎమ్మెల్యే ఐలయ్య సొంత మండలంలో పొలాలకు నీళ్లు లేక కరెంటు లేక చాలామంది పంటల పంటలు వేయకుండా ఉన్న పరిస్థితి కనిపిస్తుంది నీళ్ల ఐలయ్య కాదు రీల్స్ ఐలయ్య అని జనం అనుకుంటున్నారు అని ఈ సందర్భంగా పేర్కొన్నారు హంగు ఆర్భాటాలకే తప్ప రైతులకు మేలు చేసింది ఏమీ లేదు రైతు బీమా కూడా ఈ ప్రభుత్వం ఎల్ఐసి కి డబ్బులు చెల్లించడం లేదు వీటి మీద స్థానిక తాసిల్దార్ కి భాజపా ఆధ్వర్యంలో నిరసన తెలియజేసి వినతిపత్రం ఇవ్వడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కాదురి అచ్చయ్య జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షులు కిషన్ నాయక్ బిజెపి మండల మాజీ అధ్యక్షులు గుంటిపల్లి సత్యం బిజెపి మండల ప్రధాన కార్యదర్శి గోపగాని ప్రసాద్ గౌడ్, దేవరకొండ నారాయణ, పట్టణ ప్రధాన కార్యదర్శి జెల్లబాంచందర్ ,మందోజి నరేష్ కార్యదర్శులు సుంచు శ్రావణ్, దొమ్మాట ప్రభాకర్ పలుగుల సురేష్ ఆవుల సత్యనారాయణ ఆలేటి కర్ణ కిసాన్ మోర్చా అధ్యక్షులు రాజిరెడ్డి జిల్లా కౌన్సిల్ నెంబర్ మహేష్ గౌడ్ ,ఉపాధ్యక్షులు ఏలూరి సత్యనారాయణ, కొత్తపల్లి రమేష్, దొమ్మాట నరేష్,వాల్మీకి అజయ్ సుదగాని శివ బండకింది సాయి ప్రవీణ్ ,చింతల శ్యామ్, భాను కళ్యాణ్, నాగేందర్, శ్రీనాథ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పని గంటలు పెంచుతూ జారీ చేసిన ఉత్తర్వులు వెంటనే రద్దు చేయాలి

* జీ వో ప్రతులను దగ్ధం చేసిన సీఐటీయూ నాయకులు.



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: తెలంగాణ రాష్ట్రంలో ఉన్న కార్మికులను మోసం చేస్తూ వారి యొక్క శ్రమను దోపిడీ చేసే విధంగా పని గంటలు పెంచుతూ కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే వెనక్కు తీసుకోవాలని ఆ ఉత్తర్వులను రద్దు చేయకపోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమాన్ని కార్మికుల ఐక్యతతో పోరాతాన్ని ఉదృతం చేస్తామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే రమేష్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సీఐటీయూ కొత్తగూడెం పట్టణ కమిటీ అధ్వర్యంలో ఉత్తర్వులను రద్దు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏజె రమేష్ మాట్లాడుతూ ఇప్పటికే కేంద్ర బిజెపి ప్రభుత్వం నాలుగు లేబర్ కోర్టులను తీసుకువచ్చి కార్మికుల హక్కులను కాలరాస్తూ అనేక ఇబ్బందులు గురి చేస్తున్న బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తామని చెబుతూ కల్లబొల్లి మాటలు అల్లిన కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో పనిగంటలు పెంచుతూ తీసుకువచ్చిన జీవోని వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజా పాలన సాగిస్తున్నమని మాయమాటలు చెబుతూ ప్రజలకు మోసం చేస్తున్న పద్ధతి సరైనది కాదన్నారు. కార్మికుల హక్కులను కాలరాస్తున్న ఏ ప్రభుత్వమైన కార్మిక వర్గం ఒక్కతాటి పైన ఉండి, వారి హక్కుల రక్షణ కోసం పోరాటాలు చేస్తామని అన్నారు. పని గంటల సమయం పెంచిన ప్రభుత్వ ఉత్తర్వు వెనక్కు తీసుకోవాలి అని డిమాండ్ చేశారు. లేదంటే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు చోటు చేసుకుంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్ సిఐటియు నాయకులు లిక్కి బాలరాజు జునుమాల నగేష్ నందిపాటి రమేష్ అభిమన్యు లింగయ్య రాములు రమేష్ హమాలీ కార్మికులు పాల్గొన్నారు..

## మాజీ మంత్రులను కలిసిన అశ్వంత్ కుమార్

కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : బీఆర్ఎస్ వి స్టేట్ జనరల్ సెక్రటరీ అశ్వంత్ కుమార్ జన్మదినం సందర్భంగా సోమవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ , మాజీ మంత్రి హరీష్ లు ఆయనను కలిసి ఆశీర్వాదం తీస్కోవడం జరిగింది.



## బస్తీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

* పాపిరెడ్డి నగర్ బస్తి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊట్ల చంద్ర రెడ్డి



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : బస్తీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని పాపిరెడ్డి నగర్ బస్తి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊట్ల చంద్ర రెడ్డి అన్నారు. కూకట్ పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ బస్తీలోని ప్రతి సమస్యను పరిష్కరిస్తూ అన్ని విధాలుగా అభివృద్ధి పరిచేందుకు కట్టుబడి ఉన్నామని బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊట్ల చంద్ర రెడ్డి తెలిపారు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆర్కే పూడి గాంధీ , కూకట్ పల్లి డివిజన్ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ ల సహకారంతో బస్తీలో జరుగుతున్న సిసి రోడ్ నిర్మాణ పనులను సోమవారం స్థానిక నేతలతో కలిసి చంద్రారెడ్డి పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలతో సిసి రోడ్ నిర్మాణ పనులను చేపట్టి సకాలంలో పనులు పూర్తి చేసి ప్రజల అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికార కాంట్రాక్టర్లకు విజ్ఞప్తి చేశారు .కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఆర్ భగవంతు రెడ్డి, కోశాధికారి నర్సింలు ముదిరాజ్, నేతలు వనం ఆంజనేయులు, శ్రీనివాస్ , వీరబాబు, వెంకటేష్ మేస్త్రి, నరసింహారెడ్డి, భాస్కర్ గుప్తా, డి తిరుపతిరెడ్డి, యాదగిరి, లక్ష్మినారాయణ, అమర్నాథ్, జగన్ తదితరులు పాల్గొన్నారు

## ట్రినిటీలో ఘనంగా ప్రపంచ చాక్లెట్ దినోత్సవం



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం ట్రినిటీ పాఠశాలలో ప్రపంచ చాక్లెట్ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చాక్లెట్ రంగును ప్రతిబింబించే పదార్థాలైన చామగడ్డ, బ్రౌన్ రైస్, బెల్లం, కందులు, రాగులు, ఖర్జూర పండ్లు, తేనె, బ్రౌన్ బ్రెడ్, ప్లమ్, కేకులతో పాటు వివిధ రకాల చాక్లెట్లు, చాక్లెట్ డ్రింకులు, చాక్లెట్ చాకోస్, చాక్లెట్ కాఫీ, చాక్లెట్ ఐస్క్రీమ్‌లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ట్రినిటీ స్కూల్ చైర్మన్ కేవీబీ కృష్ణారావు మాట్లాడుతూ చాక్లెట్ లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు శరీర ఆరోగ్యానికి మేలు చేస్తాయన్నారు. చాక్లెట్ తినడం వలన బుద్ధి ఏకాగ్రత పెరుగుతుందన్నారు. తరచుగా తినడం, తిన్న తర్వాత నోరు కడగకపోవడం వలన దంతాలకు హాని కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రినిటీ స్కూల్ డైరెక్టర్ డాక్టర్ ఉజ్జని మంజుల, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

## ప్రమాదకర పరిస్థితిలో శ్రీశైలం జలాశయం

హైదరాబాద్: కృష్ణానదిపై కీలక ప్రాజెక్టు శ్రీశైలం ప్రమాదకర పరిస్థితిలో ఉందని, కేంద్రం తక్షణమే స్పందించి డ్యాం దిగువన ఏర్పడిన ప్లంజ్‌పూల్ మరమ్మతులపై చర్యలు తీసుకోవాలని కేంద్ర జలశక్తి శాఖను రాష్ట్ర ప్రభుత్వం కోరింది. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సోమవారం రాత్రి శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఇతర అధికారులతో శ్రీశైలం ప్రాజెక్టుపై సమావేశం నిర్వహించారు. మంత్రి సూచన మేరకు డ్యాం నిర్వహణ పరిస్థితులపై రాహుల్ బొజ్జా కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శికి లేఖ రాశారు. 'ఏటా కృష్ణా నదికి వస్తున్న భారీ వరదలతో శ్రీశైలం డ్యాం దిగువన లోతైన గుంత ఏర్పడింది. ఎన్డీఎస్ఏతో పాటు పలు కమిటీలు దీనిపై అధ్యయనం చేసి డ్యాంకు ముప్పు పొంచి ఉందని హెచ్చరించాయి.

# ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను జాప్యం లేకుండా సత్వరమే పరిష్కరించాలి

* **మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు రాధికగుప్తా**

మేడ్చల్, ప్రతినిధి, (ప్రజాస్ఫూర్తి) : ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను జాప్యం లేకుండా సత్వరమే పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు రాధికగుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, డిఆర్ఓ హరిప్రియలతో కలిసి అదనపు కలెక్టరు (102) దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు రాధికగుప్తా మాట్లాడుతూ ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు





అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలన్నారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం ఉండకూడదని అన్నారు. ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని అన్నారు. తిరస్కరించే దరఖాస్తుల గురించి అర్జీదారులకు ఎందుకు తిరస్కరిస్తున్నామనే విషయాన్ని తప్పనిసరిగా వివరంగా తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టరు సూచించారు. ఈ కార్యక్రమంలో కీసర ఆర్డీఓ ఉపేందర్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అత్యంత అనుభవం, సేవ నిరుత కలిగిన డాక్టర్లకు ఘన సత్కారం



కూకట్ పల్లి, ( ప్రజాస్ఫూర్తి ) : రాందేవ్ రావు హాస్పిటల్ లో పని చేస్తున్న అత్యంత అనుభవం , సేవ నిరుత కలిగిన వైద్యులను యాక్టివ్ నౌ ఫౌండేషన్ ద్వారా బి సి రాయ్ మెడికల్ ఎక్సలెన్స్, ఏ పి జె అబ్దుల్ కలం మెడికల్ ఎక్సెలెన్స్ అవార్డులను అందజేసి ఘనంగా సత్కరించారు. ప్రపంచ వైద్యుల దినోత్సవం సందర్భంగా. హైటెక్స్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాందేవ్ రావు హాస్పిటల్ లో విధులు నిర్వహిస్తున్న 28 మంది డాక్టర్లను సత్కరించి గౌరవించారు. మహోన్నతమైన 28 మంది డాక్టర్లను అందజేశారు. 57 సంవత్సరాలు దేశ రక్షణ లో, వైద్య రంగం లో అపార అనుభవం కలిగిన హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ కమలాకర్ ను లైఫ్ టైమ్ అచివ్మెంట్ అవార్డు తో సత్కరించారు. స్త్రీ , ప్రసుతి విభాగం లో 55 సంవత్సరాల అనుభవం ఉన్న డాక్టర్ కె.ఛాయా దేవి కి లీవింగ్ లెజెండ్ అవార్డు తో సత్కరించారు. అదే విధంగా రాందేవ్రావు ఆసుపత్రి లోని వివిధ భాగలలో పనిచేస్తున్న డాక్టర్లు డాక్టర్ ఐ.ధనలక్ష్మి, డాక్టర్ పి.శ్రీనివాసులు, డాక్టర్ జె.సుదారాణి, డాక్టర్ పి.భవాని దివ్య, డాక్టర్ ఎల్.ప్రమోదిని , డాక్టర్ ఎం.మంజుల, డాక్టర్ సుప్రియ, డాక్టర్ బి.పావని, డాక్టర్ రాజీవ్ వర్మ, డాక్టర్ లోకేష్ రెడ్డి, డాక్టర్ కార్తీక్, డాక్టర్ మౌనిక, డాక్టర్ స్వాతిరెడ్డి, డాక్టర్ సుమ, డాక్టర్ నాగేంద్ర, డాక్టర్ సైదులు, డాక్టర్ స్మిత, డాక్టర్ ధాత్రి, డాక్టర్ స్వాతి, డాక్టర్ రాధ, డాక్టర్ మంజుల, డాక్టర్ శ్రీదివ్య, డాక్టర్ సత్యనారాయణ లను ఎపిజె అబ్దుల్ కలాం అవార్డులతో హైటెక్స్లో సత్కరించారు. డాక్టర్ ఎన్.యోబు ని ప్రత్యేకంగా ఎక్స్లెన్సి హస్పటల్ అడ్మినిస్టేషన్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్‌లో పయనీర్ అవార్డు తో సత్కరించారు.

# కులమతాలకి అతీతంగా అన్ని పండుగలు ఆనందంగా జరుపుకోవాలి

* **ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్**



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : డివిజన్ ప్రజలందరూ కులమతాలకి అతీతంగా అన్ని పండుగలు ఆనందంగా జరుపుకోవాలని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. సోమవారం ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ లోని కమాన్ ఎదురుగా ఉన్న దర్గాలో ఖాజా అధ్వర్యంలో నిర్వహించిన పీర్ల పండుగ ఉత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పీర్ల దేవుళ్ల ప్రతిమలను పూజించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఉండే ముస్లింలందరూ రంజాన్, బక్రీద్ తర్వాత జరుపుకునే ముఖ్యమైన పండుగల్లో మొహర్రం (పీర్ల పండుగ) ఒకటి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఖలీమ్, హుస్సేన్, రఫిఖ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవం



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి ) : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి 31వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం బాలానగర్ మండలం ఇందిరానగర్ యందు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పద్మశ్రీ మందకృష్ణ మాదిగ హజరై జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం ఆయన 60వ జన్మదినం పురస్కరించుకొని వేడుకలు ఘనంగా నిర్వహించి కేక్ కట్ చేయడం జరిగింది ఈ యొక్క కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మేడ్చల్ జిల్లా ఇంచార్జ్ కూకట్ పల్లి ముని రాతి అరుణ్ కుమార్ మాదిగ విచ్చేశారు బాలనగర్ మండల్ ఇంచార్జ్ రాస మల్ల యాదగిరి మాదిగ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు బాచుపల్లి మండల ఇంచార్జ్ ముత్యపాగ శ్రీనివాస్ మాదిగ ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కూకట్ పల్లి మండల్ ఇన్చార్జ్ శ్రీనివాస్ సాయి మాదిగ సన్నీ మాదిగ అల్లాపూర్ డివిజన్ అధ్యక్షులు శశి కుమార్ మాదిగ కురుమయ్య మాదిగ రాజు మాదిగ అంబేద్కర్ సంఘం అధ్యక్షులు మధు మాదిగ దగ్గుపాటి వెంకటేష్ మాదిగ వివిధ ఎమ్మార్పీఎస్ నాయకులు కార్యకర్తలు యొక్క కార్యక్రమంలో పాల్గొన్నారు.

# జులై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

* **సీఐటీయూ, ఏఐటీయూసీ, ఏఐసిటియు వామపక్ష కార్మిక సంఘాల పిలుపు.**
* **తెలంగాణ ప్రభుత్వం 8 గంటల పని దినాన్ని 10 గంటలకు పెంచుతూ తీసుకువచ్చిన జీవో నెంబర్ 282 ను వెంటనే రద్దు చేయాలి..**



జులై 9 దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని వామపక్ష కార్మిక సంఘాలు ఏఐటీయూసీ, సీఐటీయూ, ఎఐసిటియు ఆధ్వర్యంలో నిజాంపేట కార్పొరేషన్ ప్రగతి నగర్ సుందరయ్య భవన్ నందు సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి సిఐటియు జిల్లా నాయకులు ఎం. చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఏఐటియుసి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నాయకులు పాలబిందెల.శ్రీనివాస్ ,సిఐటియు జిల్లా నాయకులు జీ. వెంకటరాజ్యం ఏఐసిటియు మండల నాయకులు పీ.దస్తగిరి మాట్లాడుతూ కార్మిక వర్గం సమస్యల పోరాటాల ద్వారా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్లను బిజెపి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చినద న్నారు. కేంద్ర ప్రభుత్వం, ప్రభుత్వ సంస్థల ప్రవేటికరణను వెంటనే ఆపాలని వారు కోరారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనాల కోసం కార్మికులకు అన్యాయం చేస్తున్నారు అని అన్నారు. కార్పొరేట్ సంస్థల లాభాల కోసం 8 గంటల పని దినాన్ని 10 గంటలకు పెంచుతూ తెలంగాణ ప్రభుత్వం తీసుకు వచ్చిన జీవో నెంబర్ 282, కార్మికుల శ్రమ దోపిడీకి గురి చేస్తున్న దన్నారు.జిఓ నెం. 282 ను వెంటనే రద్దు చేయాలనీ వారు డిమాండ్ చేశారు. అనంతరం జిఓ నెం. 282 కాపీలను దగ్ధం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మున్సిపల్ నాయకులు పీ. పెంటయ్య, బాలవేంకటేశ్వర్ రావు, నాగభూషణం, రాదా కృష్ణ, రవి కుమార్, ఏఐటీయూసీ నాయకులు బోయ.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ లో ఉన్న 8200వేల కోట్లస్కాలర్ షిప్స్ & ఫీజు రీయంబర్స్ మెంట్స్ విడుదల చేయాలి..

* **ఈసీఐఎల్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం ముందు ధర్నా**
* **యుఎస్ఎఫ్ ఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ.**




ప్రజాస్ఫూర్తి, కాప్రా: పెండింగ్ లో ఉన్న 8200 కోట్లస్కాలర్ షిప్ రియంబర్స్ మెంట్ ని విడుదల చేయాలని యుఎస్ఎఫ్ఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది.ఈ సందర్భంగా యుఎస్ ఎఫ్ ఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి బ్యాగారి వెంకటేష్ మాట్లడుతూ.... రాష్ట్రంలో గత 10 యేండ్ల నుండి ఫీజు రీయంబర్స్ మెంట్స్ ,స్కాలర్ షిప్స్ 8200 కోట్లు రూపాయలు పెండింగ్ లో ఉన్నాయని వాటిని ప్రభుత్వం విడుదల చేయాలని, వాటిని విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు అని అన్నారు. విద్యారంగం పట్ల ప్రభుత్వం మరింత కేంద్రీకరణ పెట్టాలని అన్నారు. కార్పోరేట్ ,ప్రైవేటు విద్యాసంస్థలలో ఫీజులు లక్షల రూపాయల పెంచుతున్నారని వాటిని ప్రభుత్వం నియంత్రించేందుకు చట్టం చేయాలని యుఎస్ఎఫ్ఐ డిమాండ్ చేస్తుంది పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ రియంబర్స్ మెంట్ విడుదల చేయకపోవడం వల్ల పేద బడుగు బలహీన వర్గాలకు సంబంధించిన విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారు ప్రభుత్వం వెంటనే పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని అన్నారు లేని పక్షంలో విద్యార్థుల అందరిని ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఖుషి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు

# సార్వత్రిక సమ్మెలో ఆటో డ్రైవర్లు పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలి



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : జూలై 9 సార్వత్రిక సమ్మెలో ఆటో డ్రైవర్లు అధిక సంఖ్యలో పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ, ఎఐటీయూసి, టీయుసిఐ వామపక్ష కార్మిక ఆటో డ్రైవర్స్ యూనియన్ల ఆధ్వర్యంలో జూలై 9 సమ్మెను జయప్రదం చేయాలని జీడిమెట్ల బస్ డిపో నుండి ఉషోదయ టవర్స్ వరకు ఆటో ర్యాలీ నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొని మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జూలై 9న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెలో రవాణా రంగ కార్మికులు ఆటో డీసీఎం లారీ మినీ గూడ్స్ వెహికల్ డ్రైవర్లు ఓనర్లు అధిక సంఖ్యలోపాల్గొనాలని అన్నారు రవాణా రంగంలో పనిచేస్తున్న కార్మికులకు రక్షణ కల్పించేందుకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ప్రమాద భీమా , థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ విధానాలను అందుబాటులోకి తేవాలని రవాణా రంగ కార్మికులకు శాపంగా మారిన జీవో నెంబర్ 21ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రవాణా రంగ కార్మికులందరికీ సంక్షేమ బోర్డు ఏర్పాటుచేసి బీమా సౌకర్యం కల్పించాలని నాన్ లోకల్ పర్మిట్ల నియంత్రించాలని ఓలా, ఉబర్, రాపిడో వంటి ప్రైవేట్ యాప్‌ల దోపిడికి చెక్ పెట్టాలని కేరళ ప్రభుత్వ యాప్ (సవారి) నీ దేశవ్యాప్తంగా అమలు చేయాలన్నారు. 2019 మోటార్ వెహికల్ సవరణ చట్టం ఉపసంహరించుకోవాలని 29 కార్మిక చట్టాల పునరుద్ధరణ చేయాలని నాలుగు కొత్త లేబర్ కోడ్‌ల రద్దు చేయాలన్నారు. ఇల్లు లేని ఆటో, ట్రాలీ, లారీ, బస్సు డ్రైవర్లకు ఇందిరమ్మ ఇండ్లు, పార్కింగ్ స్థలాలు కేటాయించాలన్నారు. ఆర్టీఏ, ట్రాఫిక్ పోలీసుల వేధింపులు ఆపాలని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆటో డ్రైవర్లకురూ.12,000 ఆర్థిక సహాయం వెంటనే విడుదల చేయాలని మహాలక్ష్మి పథకం ద్వారా నష్టపోతున్న ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో సిఐటియు కుత్బుల్లాపూర్ మండల అధ్యక్షులు కీలుకాని లక్ష్మణ్ పసుల అంజయ్య ఖలీల్, ఏఐటియుసి జిల్లా నాయకులు కే స్వామి, ప్రవీణ్. నరసింహారెడ్డి, టియుసిఐ రాష్ట్ర నాయకులు వి ప్రవీణ్ ఈశ్వర్ మరియు అధిక సంఖ్యలో ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

# పట్టణ స్థానిక సంస్థలకు రూ.2,355 కోట్లు!

* **అత్యవసర పనులకు వినియోగం**

హైదరాబాద్: పట్టణస్థానిక సంస్థల్లో అభివృద్ధి పనులను చేపట్టేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. జీహెచ్ఎంసీ మినహా రాష్ట్రంలోని నగరపాలక, పురపాలక సంస్థల్లో అత్యవసర పనుల కోసం ఈ నిధులు మంజూరు చేయనుంది. ఇందుకోసం రూ.2,355 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. టీయూఎఫ్ఐడీసీ ద్వారా రుణం తీసుకొని ఆ నిధులను పట్టణ స్థానిక సంస్థలకు అందజేయనున్నారు. ఈ నెలలోనే ఈ ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. రాష్ట్రంలోని పట్టణస్థానిక సంస్థల్లో కొద్దిరోజులుగా అభివృద్ధి కుంటుపడిన సంగతి తెలిసిందే. వీటిలో జీహెచ్ఎంసీ మినహా మిగతా పాలకవర్గాలకు ఈ ఏడాది జనవరిలోనే గడువు ముగిసిపోయింది. అవి ప్రస్తుతం ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో పనిచేస్తున్నాయి. అయితే నిధుల కొరత కారణంగా గత కొంతకాలంగా అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో అభివృద్ధి పనులు నెమ్మదించాయి. అన్ని పట్టణస్థానిక సంస్థల గడువు ముగిసే ముందే పాలకమండళ్లు సమావేశమై పెద్దఎత్తున అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపాయి.

# ఎమ్మెల్సీ కవితతో ఈటల రాజేందర్ కీలక అనుచరుడి భేటీ!!

* ఎమ్మెల్సీ కవితతో భేటీ అయిన మేడ్చల్ బీజేపీ నేత రామిడి వెంకట్ రెడ్డి
* వెంకట్ రెడ్డి బీజేపీకి రాజీనామా చేసి జాగృతిలో చేరతారనే ప్రచారం
* ఇటీవల తెలంగాణ బీజేపీ చీఫ్ గా రాంచందర్ రావు నియామకం



మేడ్చల్‌కు చెందిన బీజేపీ నేత రామిడి వెంకట్ రెడ్డి మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు గట్టి మద్దతుదారుగా ఉన్నారు. ఆయన ఇవాళ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితతో సమావేశం కావడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈటలకే బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి దక్కుతుందని ఆయన ఆశించగా... అధిష్ఠానం అనూహ్యంగా రామచందర్‌రావును ఎంపిక చేయడంతో ఆయన తీవ్ర అసంతృప్తికి గురైనట్లు కథనాలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే ఆయన ఎమ్మెల్సీ కవితతో భేటీ అయ్యారని, బీజేపీకి రాజీనామా చేసి తెలంగాణ జాగృతిలో చేరబోతున్నారని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇదివరకే ఎమ్మెల్యే రాజాసింగ్ పార్టీకి రాజీనామా చేయగా, ఇప్పుడు వెంకట్ రెడ్డి బాటలో మరికొంతమంది నేతలు పార్టీని వీడతారనే ప్రచారం జరుగుతోంది. బీజేపీ తెలంగాణ అధ్యక్షుడిగా ఆ పార్టీ హైకమాండ్ రాంచందర్ రావును నియమించడం తెలిసిందే.

## తెలంగాణ గ్రూప్1 అంశం.. ముగిసిన వాదనలు, తీర్పు వాయిదా

* తెలంగాణ గ్రూప్-1 కేసులో వాదనలు పూర్తి
* తీర్పును రిజర్వ్ చేసిన హైకోర్టు
* మూల్యాంకనంలో అక్రమాలు జరిగాయని పిటిషన్లు
* మెయిన్స్ పత్రాలు మళ్లీ దిద్దాలని పిటిషనర్ల అభ్యర్థన
* లేదంటే పరీక్ష మళ్లీ నిర్వహించాలని డిమాండ్
* నియామకాలపై స్టే ఎత్తివేయాలని ఎంపికైన అభ్యర్థుల వాదన



తెలంగాణ గ్రూప్1 నియామక ప్రక్రియలో నెలకొన్న వివాదంపై హైకోర్టులో వాదనలు ముగిశాయి. పరీక్షల మూల్యాంకనంలో అక్రమాలు జరిగాయంటూ దాఖలైన పలు పిటిషన్లపై సుదీర్ఘంగా వాదనలు విన్న న్యాయస్థానం, తుది తీర్పును రిజర్వ్ చేసింది. దీంతో గ్రూప్1 అభ్యర్థుల భవితవ్యంపై ఉత్కంఠ నెలకొంది. గ్రూప్1 మెయిన్స్ పరీక్ష పత్రాల మూల్యాంకనంలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ కొందరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. తమ జవాబు పత్రాలను రీ వాల్యుయేషన్ చేయాలని వారు పిటిషన్‌లో కోరారు. ఒకవేళ అది సాధ్యం కాకపోతే, గ్రూప్1 పరీక్షలను పూర్తిగా రద్దు చేసి మళ్లీ నిర్వహించేలా ఆదేశాలు ఇవ్వాలని న్యాయస్థానానికి విజ్ఞప్తి చేశారు. గతంలో ఈ నియామకాలపై జస్టిస్ రాజేశ్వరరావు ఇచ్చిన స్టేను ఎత్తివేయాలని కోరుతూ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు కూడా పిటిషన్లు దాఖలు చేశారు. ఇరుపక్షాల వాదనలను పరిశీలించిన ధర్మాసనం, తదుపరి తీర్పును వెల్లడించేంత వరకు రిజర్వ్‌లో ఉంచింది.

## కబడ్డీ ఆడిన తెలంగాణ మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి

* సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో మంత్రులు పొన్నం, శ్రీహరి పర్యటన
* స్థానిక మినీ స్టేడియాన్ని సందర్శించిన మంత్రులు
* క్రీడాకారులను ఉత్సాహపరిచేందుకు కబడ్డీ ఆడిన మంత్రులు
* తెలంగాణ కీర్తిని క్రీడల్లో విశ్వవ్యాప్తం చేస్తామన్న మంత్రులు
* కబడ్డీ ఆడిన స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్, ఎండీ



రాజకీయ నాయకులు సాధారణంగా సభలు, సమావేశాల్లో కనిపిస్తుంటారు. అయితే, తెలంగాణ మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి కబడ్డీ కోర్టులో దిగి అందరినీ ఆశ్చర్యానికి గురి చేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పర్యటనలో భాగంగా వారు స్థానిక మినీ స్టేడియాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి క్రీడాకారులతో కలిసిపోయి వారిలో స్ఫూర్తిని నింపేందుకు స్వయంగా కబడ్డీ ఆడారు. మంత్రులతో పాటు తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఛైర్మన్ శివసేనా రెడ్డి, ఎండీ సోనీ బాలాదేవి కూడా కబడ్డీ ఆడారు. మంత్రులు మైదానంలోకి దిగి కబడ్డీ ఆడటంతో అక్కడున్న యువ క్రీడాకారుల్లో నూతనోత్సాహం వెల్లివిరిసింది. అనంతరం మంత్రులు మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రాన్ని క్రీడల్లో ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ స్థానంలో నిలబెట్టడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని క్రీడా ప్రతిభను వెలికితీసి, వారికి అవసరమైన శిక్షణ, మౌలిక వసతులు కల్పించి అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దుతామని వారు తెలిపారు. యువతను క్రీడల వైపు ప్రోత్సహించడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి పాటుపడతామని మంత్రులు పేర్కొన్నారు.

## ఢిల్లీలో రేవంత్ రెడ్డి బిజీ బిజీ.. హీరో అజయ్ దేవగణ్, మాజీ క్రికెటర్ కపిల్‌దేవ్‌తో కీలక చర్చలు!

* ఢిల్లీ పర్యటనలో బిజీబిజీగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
* బాలీవుడ్ నటుడు అజయ్ దేవగణ్ తో కీలక భేటీ
* తెలంగాణలో అంతర్జాతీయ ఫిల్మ్ సిటీ ఏర్పాటుపై చర్చ
* మాజీ క్రికెటర్ కపిల్ దేవ్‌తోనూ ముఖ్యమంత్రి సమావేశం
* హైదరాబాద్‌లో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుపై మంతనాలు





తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ఢిల్లీ పర్యటనలో భాగంగా రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు కీలక సమావేశాల్లో పాల్గొన్నారు. ఈ పర్యటనలో ఆయన బాలీవుడ్ ప్రముఖ నటుడు అజయ్ దేవగణ్, భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ కపిల్ దేవ్‌లతో వేర్వేరుగా భేటీ అయ్యారు. ఈ సమావేశాలు రాష్ట్రంలో రెండు ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల ఏర్పాటుపై కేంద్రీకృతం కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఢిల్లీలోని తన నివాసంలో అజయ్ దేవగణ్ తో సమావేశమైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తెలంగాణలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఫిల్మ్ సిటీ నిర్మించే అంశంపై చర్చలు జరిపారు. ఈ ఫిల్మ్ సిటీలో ఏఐ (AI) టెక్నాలజీతో కూడిన వీఎఫ్ఎక్స్ (VFX), స్మార్ట్ స్టూడియోలు ఏర్పాటు చేయాలని, అలాగే ఒక ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌ను కూడా స్థాపించాలని అజయ్ దేవగణ్ ప్రతిపాదనలు అందజేశారు. భారత క్రికెట్ దిగ్గజం కపిల్ దేవ్‌తోనూ ముఖ్యమంత్రి రేవంత్ భేటీ అయ్యారు. హైదరాబాద్ కేంద్రంగా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసే అంశం వీరిద్దరి మధ్య చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి, క్రీడాకారులను ప్రోత్సహించడానికి ఈ యూనివర్సిటీ దోహదపడుతుందని భావిస్తున్నారు.

## గొర్రెలు, బర్రెలు ఇస్తే నేనేం చేసుకోవాలి?

### కేటాయించిన శాఖలపై మంత్రి శ్రీహరి సంచలన వ్యాఖ్యలు

* గత పదేళ్లలో నాశనమైన శాఖలను తనకిచ్చారని ఆవేదన
* గొర్రెలు, బర్రెలతో తానేం చేయాలని సూటి ప్రశ్న
* ఇది తన అదృష్టమో, దురదృష్టమో అర్థం కావడం లేదన్న శ్రీహరి
* అంతకుముందు కరీంనగర్‌లో క్రీడా పాఠశాలలపై కీలక ప్రకటనలు
* రాష్ట్రంలో కొత్తగా మూడు క్రీడా పాఠశాలల ఏర్పాటుకు హామీ



తెలంగాణ మంత్రి వాకిటి శ్రీహరి తనకు కేటాయించిన శాఖలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గత పదేళ్లలో పూర్తిగా దెబ్బతిన్న శాఖలను తనకు అప్పగించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తనకు కేటాయించిన ఐదు శాఖలు అస్తవ్యస్తంగా ఉన్నాయని, వాటిని చూస్తుంటే ఇది తన అదృష్టమో లేక దురదృష్టమో అర్థం కావడం లేదని అన్నారు. "పశుసంవర్ధక శాఖ మొత్తం గందరగోళంగా ఉంది. యువజన సర్వీసులు ఇచ్చి నన్నేం చేసుకోమంటారు? గొర్రెలు, బర్రెలు ఇస్తే ఏం చేసుకోవాలి?" అని మంత్రి శ్రీహరి నిరాశ వ్యక్తం చేశారు. ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. అంతకుముందు కరీంనగర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి శ్రీహరి మాట్లాడుతూ, క్రీడల అభివృద్ధికి పలు హామీలు ఇచ్చారు. కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో సింథటిక్ ట్రాక్‌తో పాటు, కబడ్డీ, హ్యాండ్‌బాల్ కోర్టులు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లలో కొత్త క్రీడా పాఠశాలలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కరీంనగర్ క్రీడా పాఠశాలను ఇంటర్మీడియట్ స్థాయికి అప్‌గ్రేడ్ చేస్తామని కూడా ఆయన హామీ ఇచ్చారు.

## రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై హరీశ్ రావు తీవ్ర విమర్శలు

* ఓట్ల కోసమే ప్రభుత్వం రైతుబంధు నిధులు విడుదల చేస్తోందని ఆరోపణ
* కేసీఆర్ నాట్ల మధ్య.. రేవంత్ ఓట్ల మధ్య రైతుబంధు ఇస్తున్నారని వ్యాఖ్య
* గ్రామాల్లో ఎరువులు, యూరియా కొరత తీవ్రంగా ఉందని వెల్లడి
* ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలను ప్రభుత్వం విస్మరించిందని విమర్శ




తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలనను గాలికొదిలేసిందని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. కేవలం పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే ప్రభుత్వం ఇప్పుడు రైతుబంధు నిధులను విడుదల చేస్తోందని ఆయన ఆరోపించారు. సోమవారం నాడు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన గత బీఆర్ఎస్ పాలనను ప్రస్తుత ప్రభుత్వంతో పోలుస్తూ విమర్శలు గుప్పించారు. "కేసీఆర్ రైతుల అవసరాలు గుర్తించి నాట్లకు, నాట్లకు మధ్య రైతుబంధు ఇచ్చారు. కానీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఓట్లకు, ఓట్లకు మధ్య రైతుబంధు ఇస్తోంది" అని ఆయన ఎద్దేవా చేశారు. ఇది పూర్తిగా రాజకీయ లబ్ధి కోసమేనని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తూ, గ్రామాల్లో ఎరువులు, యూరియా కొరత తీవ్రంగా ఉందని హరీశ్ రావు అన్నారు. ప్రభుత్వం రైతుల అవసరాలను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ 420 హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాల వల్ల పాలన కుంటుపడిందని ఆయన ఆరోపించారు.

## నల్గొండ జిల్లాలో ఏసీబీకి చిక్కిన డిప్యూటీ తహసీల్దార్

* ఏసీబీ వలలో డిప్యూటీ తహశీల్దార్
* షేక్ జావీద్ అరెస్ట్
* సీజ్ చేసిన వాహనాల విడుదలకు లంచం డిమాండ్
* రూ.లక్ష అడిగి, రూ.70 వేలకు బేరసారాలు
* బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు
* లంచం అడిగితే 1064కు కాల్ చేయాలని ప్రజలకు విజ్ఞప్తి



ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నా కొందరు ఉద్యోగుల తీరు మారడం లేదు. తాజాగా నల్గొండ జిల్లాలో ఓ అవినీతి డిప్యూటీ తహసీల్దార్ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు పట్టుబడ్డాడు. సీజ్ చేసిన వాహనాలను విడుదల చేసేందుకు రూ.70,000 లంచం డిమాండ్ చేసిన కేసులో జిల్లా పౌర సరఫరాల శాఖకు చెందిన డిప్యూటీ తహశీల్దార్‌ను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే, మిర్యాలగూడ డివిజన్ పౌర సరఫరాల శాఖలో డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేస్తున్న షేక్ జావీద్, అధికారులు స్వాధీనం చేసుకున్న మూడు వాహనాల విడుదలకు ఓ వ్యక్తిని లంచం డిమాండ్ చేశాడు. వాహనాలకు పంచనామా నిర్వహించి, కోర్టు నుంచి విడుదల ఉత్తర్వులు ఇప్పించేందుకు గాను తొలుత రూ.1,00,000 కావాలని అడిగాడు. ఆ తర్వాత బేరసారాలతో రూ.70,000 ఇచ్చేందుకు ఒప్పందం కుదిరింది. అయితే, లంచం ఇవ్వడానికి ఇష్టపడని బాధితుడు నేరుగా ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. అతని ఫిర్యాదు ఆధారంగా జూన్ 7న కేసు నమోదు చేసుకున్న ఏసీబీ అధికారులు, విచారణ జరిపి డిప్యూటీ తహశీల్దార్ షేక్ జావీద్‌ను అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఏసీబీ అధికారులు ప్రజలకు కీలక సూచన చేశారు. ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా లంచం అడిగితే తమ టోల్ ఫ్రీ నంబర్ 1064కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. వాట్సాప్ (9440446106), ఫేస్‌బుక్, ఎక్స్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

## తెలంగాణ కాంగ్రెస్‌లో కీలక నియామకాలు.. ఉమ్మడి జిల్లాలకు కొత్త ఇన్‌ఛార్జ్‌లు

తెలంగాణలో పార్టీని క్షేత్రస్థాయి నుంచి పటిష్ఠం చేసే దిశగా కాంగ్రెస్ అధిష్ఠానం కీలక చర్యలు చేపట్టింది. సంస్థాగత నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించిన టీపీసీసీ, తాజాగా 10 ఉమ్మడి జిల్లాలకు ఇన్‌ఛార్జ్‌లను నియమించింది. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఇప్పటికే నియామకాలు చేపట్టిన కాంగ్రెస్, ఇప్పుడు జిల్లాలపై దృష్టి సారించింది. ఈ నియామకాల అనంతరం ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ నూతన ఇన్‌ఛార్జ్‌లతో జూమ్ వేదికగా సమావేశమయ్యారు. రాబోయే రోజుల్లో అనుసరించాల్సిన విధివిధానాలను వారికి స్పష్టంగా వివరించారు. త్వరలోనే గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు మీనాక్షి నటరాజన్ వెల్లడించారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన నేతలంతా తక్షణమే క్షేత్రస్థాయిలో విధుల్లో చేరాలని ఆమె దిశానిర్దేశం చేశారు.

* **ఉమ్మడి జిల్లాల వారీగా నియమితులైన ఇన్‌ఛార్జ్‌ల వివరాలు:**

ఖమ్మం: వంశీచంద్‌రెడ్డి, నల్గొండ: సంపత్ కుమార్, వరంగల్: అడ్లూరి లక్ష్మణ్, మెదక్: పొన్నం ప్రభాకర్, హైదరాబాద్: జగ్గారెడ్డి, మహబూబ్‌నగర్: కుసుమ కుమార్, ఆదిలాబాద్: అనిల్ యాదవ్, కరీంనగర్: అద్దంకి దయాకర్, నిజామాబాద్: అజ్మతుల్లా హుస్సేన్, రంగారెడ్డి: శివసేన రెడ్డి



# చిరు సినిమాలో నటిస్తున్నా: వెంకటేశ్

**టాకీస్:** స్టార్ హీరో వెంకటేశ్ తన రానున్న సినిమాల లైనప్ చెప్పి అభిమానుల్లో జోష్ నింపారు. అమెరికాలో వైభవంగా జరిగిన 'నాట్స్ 2025'లో సందడి చేసిన వెంకటేశ్ తన సినిమాల గురించి మాట్లాడారు. ప్రస్తుతం ఇవి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వెంకీ చిరంజీవి సినిమాలో కనిపించనున్నట్లు ఎన్నో రోజులుగా వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. ఇప్పుడు ఈ విషయాన్ని వెంకీ మామ కూడా ధ్రువీకరించారు. ఆ పాత్ర ఎలా ఉంటుందో కూడా చెప్పారు. మాటల మాంత్రికుడు త్రివిక్రమ్‌తో ఓ ప్రాజెక్ట్ చేస్తున్నా. అలాగే చిరంజీవి సినిమాలో అతిథి పాత్రలో నటిస్తున్నాను. అది చాలా ఫన్నీగా ఉంటుంది. ప్రేక్షకులకు నవ్వులు పంచుతుంది. అలాగే మీనాతో కలిసి 'దృశ్యం 3' సినిమా చేస్తున్నా. ఇటీవల అనిల్ రావిపూడితో కలిసి 'సంక్రాంతికి వస్తున్నాం'తో హిట్ కొట్టాం. మేమిద్దరం మళ్లీ రాబోతున్నాం. వీటన్నింటితో పాటు- మరో భారీ ప్రాజెక్ట్‌లో నా స్నేహితుడితో కలిసి నటిస్తున్నాను. తెలుగు ఇండస్ట్రీలో ఆయన ఓ పెద్ద స్టార్' అని వెంకటేశ్ తెలిపారు. తనపై ప్రేమాభిమానాలు చూపుతోన్న అభిమానులకు నాట్స్ వేదికగా ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ ఏడాది పెద్ద పండగకు 'సంక్రాంతికి వస్తున్నాం' అంటూ పెద్ద విజయాన్ని సొంతం చేసుకున్నారు వెంకటేశ్. వచ్చే సంక్రాంతికి అనిల్ రావిపూడి – చిరంజీవి కాంబోలో రానున్న సినిమా విడుదల కానున్న విషయం తెలిసిందే. వినోదంతో పాటు బలమైన భావోద్వేగాలు నిండిన యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం రూపొందనుంది. ఇందులో వెంకటేశ్ కనిపించనున్నారు. ఇందులో చిరు సరసన నయనతార నటిస్తున్నారు. దీంట్లో శివశంకర వరప్రసాద్‌గా తన ఒరిజినల్ పేరుతో ఉన్న పాత్రలో చిరు సందడి చేయనున్నారు.

# కింగ్డమ్ రిలీజ్‌కు సిద్ధం




**టాకీస్:** టాలీవుడ్ టాలెంటెడ్ యాక్టర్ విజయ్ దేవరకొండ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ యాక్షన్ డ్రామా 'కింగ్డమ్'. దర్శకుడు గౌతమ్ తిన్ననూరి తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో విజయ్ దేవరకొండ ఓ ఇంటెన్స్ యాక్షన్ పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటి వరకు విడుదలైన పోస్టర్స్, గ్లింప్సెస్ చూసిన ప్రతి ఒక్కరికీ ఆయనలో కొత్త యాంగిల్ కనిపిస్తోంది. ఈ పాత్ర కోసం విజయ్ భారీగా ట్రాన్స్‌ఫర్మ్ అయినట్టు- సమాచారం. అతని పెర్ఫార్మెన్స్ ఈసారి మరో లెవెల్‌లో ఉండనుందట. ఇక భాగ్యశ్రీ బొర్సె హీరోయిన్ గా నటిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉండగా.. ఇటీవల వరుస వాయిదాలు తీసుకుంటూ వచ్చిన 'కింగ్డమ్', ఎట్టకేలకు రిలీజ్ డేట్‌ను ఫిక్స్ చేసుకుంది. ఇప్పటికే రిలీజ్ వాయిదాల కారణంగా నిరాశ చెందిన ఫ్యాన్స్ ఇప్పుడు ఊపిరి పీల్చు కుంటు- న్నారు. మొత్తనికి 'కింగ్డమ్' మూవీ, ఇప్పుడు దూసుకెళ్లేందుకు సిద్ధమైంది. అభిమానులకూ, బాక్సాఫీస్‌కి ఇది మంచి ఉత్సాహం కలిగించే సినిమా కావొచ్చని ఇండస్ట్రీలో జోరుగా చర్చ సాగుతోంది.

# సినిమా బిజీలో వ్యక్తిగత జీవితం కోల్పోతున్నా

### స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న ఆవేదన




టాకీస్: పాన్ ఇండియా స్టార్ హీరోయిన్‌గా వెలుగొందుతున్న అందాల నటి రష్మిక మందన్న. ఇటీవల ఈ ముద్దుగుమ్మ నటించిన ప్రతి సినిమా సూపర్ డూపర్ హిట్ అవుతుంది. అయితే కెరీర్‌లో అగ్రస్థాయికి చేరుకున్నా, దాని వెనక తన వ్యక్తిగత జీవితంలోచేసిన త్యాగాలు, ఎడబాటు- గురించి మాట్లాడుతూ ఎమోషనల్ అయింది. రష్మిక ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత జీవితంపై చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. నేను దాదాపు ఏడాదిన్నరగా మా ఇంటికి వెళ్లలేకపోయాను. నా చెల్లి ఇప్పుడు 13 ఏళ్లు. ఆమెతో గడిపే అమూల్యమైన క్షణాలను కోల్పోతున్నానని ఎప్పుడూ బాధగా అనిపిస్తుంది. నాకు ఆమెకి 16 ఏళ్ల తేడా. అయినా, మా మధ్య అనుబంధం చాలా బలంగా ఉంది. ఒక్కోసారి శని, ఆదివారాలు ఇంట్లో ఉండాలనిపిస్తుంది... సెలవు దొరక్క ఏడుపొస్తుందని బాధపడింది. కేవలం కుటుంబం మాత్రమే కాదు, స్నేహితుల నుండి కూడా దూరం అయ్యాను. ఒకప్పుడు చిన్న చిన్న ట్రిప్స్‌కు, పార్టీకి నన్ను పిలిచే స్నేహితులు ఇప్పుడు కాల్ చేయడం మానేశారు. ఎందుకంటే, ఆవిడ బిజీగా ఉంటు-ంది అనే భావన వాళ్లలో నెలకొందని నేను ఫీలవుతున్నాను. నిజానికి వాళ్లతో పాటు- గడిపే క్షణాలు జీవితానికి చాలా అవసరం. కానీ ఈ బిజీ షెడ్యూల్ కారణంగా వాళ్లను మిస్ అవుతున్నాను. తన తల్లి చెప్పిన మాటలని కూడా రష్మిక గుర్తు చేసుకుంది. మా అమ్మ ఎప్పుడూ చెబుతుండేది . జీవితంలో రెండు దారులు ఉంటాయి. ఒకటి కెరీర్, మరొకటి వ్యక్తిగత జీవితం. రెండింటినీ బ్యాలెన్స్ చేయడం చాలా కష్టం. కానీ నేనైతే రెండు వైపులా సమంగా వెళ్తానని నమ్మే మనస్తత్వం ఉన్న వ్యక్తిని. కానీ నిజంగా ఇది ఎంత కష్టం అనేది ఇప్పుడు అనుభవిస్తున్నాను అని రష్మిక పేర్కొంది. ప్రస్తుతం రష్మిక మందన్న వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు.బాలీవుడ్‌లో ఆయుష్మాన్ ఖురానాతో కలిసి 'తామా', తెలుగులో 'ది గర్ల్‌ఫ్రెండ్', 'మైసా' చిత్రాలు చేస్తుంది. అయితే రష్మిక కామెంట్స్‌పై నెటిజన్స్ తమదైన శైలిలో కామెంట్స్ చేస్తున్నారు. స్టార్స్ కూడా మనలానే మానవులే... వాళ్లకూ కుటుంబాలుంటాయి, బాధలుంటాయి' అంటూ పలువురు ఎమోషనల్ కామెంట్లు పెడుతున్నారు.

# ఢిల్లీలోని స్టేడియంలో పెద్ది క్రికెట్ మ్యాచ్ ఫైనల్

### బుచ్చిబాబు ప్లానింగ్ మాములుగా లేదు..!



**టాకీస్:** మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు సాన దర్శకత్వంలో తెరకెక్కుతున్న పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'పెద్ది' . గత కొద్ది రోజులుగా ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. రస్టిక్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందుతున్న ఈ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. ముఖ్యంగా ఇటీవల రిలీజ్ అయిన గ్లింప్స్‌లో చరణ్ క్రికెట్ బ్యాట్ పట్టుకుని షాట్స్ కొడుతున్న సీన్స్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అయ్యాయి. ఈ గ్లింప్స్ ద్వారా పెద్ది చిత్రంలో క్రికెట్ నేపథ్యంలో కూడా కొన్ని కీలక సన్నివేశాలు ఉండబోతున్నాయని స్పష్టమైంది.

ప్రస్తుతం ఈ సినిమా మౌలాలి రైల్వే స్టేషన్ వద్ద షూటింగ్ జరుపుకుంటోంది. ఆ తర్వాత యూనిట్ నాసిక్ వెళ్లి కొన్ని కీలక సన్నివేశాలను షూట్ చేయనుంది. ఇప్పటికే మైసూరు, రామోజీ ఫిలిం సిటీలో ప్రత్యేకంగా వేసిన సెట్లలో పలు షెడ్యూల్స్‌ను పూర్తి చేశారు. తాజా సమాచారం ప్రకారం, క్లైమాక్స్‌లో భారీ క్రికెట్ మ్యాచ్ జరగనుండగా, అందులో రామ్ చరణ్ ఒక ఆటగాడిగా కనిపించి జట్టును గెలిపిస్తాడని టాక్ వినిపిస్తోంది. ఈ క్లైమాక్స్ సీన్‌ను ఢిల్లీలోని అరుణ్ జైట్లీ క్రికెట్ స్టేడియంలో చిత్రీకరించాలని మేకర్స్ భావిస్తున్నారు. ఈ మేరకు అక్కడి నిర్వాహకులతో చర్చలు కూడా జరుపుతున్నట్టు టాలీవుడ్ వర్గాల సమాచారం.

స్టేడియంలో లైవ్ క్రౌడ్, లైట్ అండ్ సౌండ్ ఎఫెక్ట్స్‌తో రియలిస్టిక్ క్రికెట్ విజువల్స్‌ను చూపించేందుకు ప్లాన్ చేస్తున్నారట. దీనికి సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. ఇక ఈ సినిమాలో బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ రామ్ చరణ్ కు జోడిగా నటిస్తోంది.



# ఒకసారి ట్రైన్ నుంచి దూకి చనిపోవాలనుకున్నా: మృణాల్ ఠాకూర్

టాకీస్: 'సీతారామం' చిత్రంతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన నటి మృణాల్ ఠాకూర్, తన కెరీర్ తొలినాళ్లలో ఎదుర్కొన్న తీవ్రమైన కష్టాల గురించి సంచలన విషయాలు వెల్లడించారు. ఒకప్పుడు అవకాశాలు లేక తీవ్రమైన డిప్రెషన్‌తో బాధపడ్డానని, ఆ సమయంలో ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచనలు కూడా వచ్చాయని ఆమె తాజాగా ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. సినీ రంగంలోకి అడుగుపెట్టిన కొత్తలో అవకాశాల కోసం ఎన్నో ఇబ్బందులు పడ్డానని మృణాల్ గుర్తుచేసుకున్నారు. ఆ ఒత్తిడి తట్టుకోలేక ఒకానొక దశలో లోకల్ ట్రైన్ నుంచి దూకి ప్రాణాలు తీసుకోవాలని కూడా అనుకున్నట్లు ఆమె చెప్పుకొచ్చారు. "అలాంటి తీవ్రమైన ఆలోచన వచ్చినప్పుడు ఒక్కసారిగా నా తల్లిదండ్రుల ముఖాలు గుర్తొచ్చాయి. వారిని తలుచుకుని ఆ నిర్ణయాన్ని విరమించుకున్నాను" అని మృణాల్ భావోద్వేగంగా తెలిపారు.

కెరీర్‌ను టీవీ సీరియల్స్‌తో ప్రారంభించిన మృణాల్ ఠాకూర్, 'కుంకుమ భాగ్య'తో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ తర్వాత హిందీలో 'సూపర్ 30', 'జెర్సీ' వంటి చిత్రాలతో నటిగా నిరూపించుకున్నారు. అయితే, 'సీతారామం' సినిమా ఆమె కెరీర్‌ను పూర్తిగా మార్చేసింది. ఈ సినిమాతో ఆమె తెలుగులో స్టార్ హీరోయిన్‌గా ఎదిగారు. ప్రస్తుతం ఆమె చేతిలో తెలుగు, హిందీ భాషల్లో కలిపి అరడజనుకు పైగా ప్రాజెక్టులు ఉన్నాయి. తెలుగులో అడివి శేష్ హీరోగా నటిస్తున్న 'డెకాయిట్' చిత్రంలో ఆమె కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రం డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఒకప్పుడు తీవ్రమైన మానసిక వేదన అనుభవించిన మృణాల్, ఇప్పుడు వరుస విజయాలతో స్టార్‌గా రాణించడం ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తోందని ఆమె అభిమానులు అంటున్నారు.

# కాంతారా.. ప్రీక్వెల్ పోస్టర్ రిలీజ్

**టాకీస్:** కన్నడ స్టార్ హీరో రిషబ్ శెట్టి నటించిన కాంతార చిత్రం ఎంత పెద్ద విజయం సాధించిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈ సినిమా దేశ వ్యాప్తంగా ప్రభంజనం సృష్టించింది. ఇప్పుడు ఈ చిత్రానికి ప్రీక్వెల్‌గా ఓ మూవీ రూపొందుతున్న విషయం తెలిసిందే. అయితే కన్నడ స్టార్ హీరో, దర్శకుడు రిషబ్ శెట్టి పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులకు సర్‌ప్రైజ్ అందించింది 'కాంతార: ఏ లెజెండ్ – చాప్టర్ 1' సినిమా బృందం. చిత్రం అక్టోబర్ 2న విడుదల కానుందని తెలియజేస్తూ ఓ పోస్టర్ విడుదల చేశారు. ఇందులో రిషబ్ లుక్ అదిరిపోయేలా ఉంది. వరాహస్వామి గర్జిస్తే ఎలా ఉంటుందో... అలా తాజా పోస్టర్‌లో వీరోచితంగా రిషబ్ శెట్టి కనిపించారు. ఈ లుక్ ప్రేక్షకులని ఎంతగానో ఆకట్టుకుంటుంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో రిషబ్ ముఖం పూర్తిగా కనిపించలేదు. కానీ తాజాగా రిలీజ్ చేసిన బర్త్‌డే పోస్టర్‌లో మాత్రం ఆయన పవర్‌ఫుల్ లుక్‌తో ఫ్యాన్స్‌కి ఫుల్ ట్రీట్ అందించారు. ఇది అసలు సిసలైన ఫస్ట్ లుక్ అని అభిమానులు భావిస్తున్నారు. 'కాంతార' తొలి భాగం రిలీజైనప్పుడు ఈ సినిమాని పాన్ ఇండియాగా రిలీజ్ చేయాలనే ఆలోచన రిషబ్‌కి లేదు. కానీ కన్నడలో ఘన విజయం సాధించిన తర్వాత తెలుగు, తమిళ, హిందీ సహా ఇతర భాషల్లో విడుదలై సంచలనం రేపింది. అదే విజయంతో ప్రీక్వెల్‌కు శ్రీకారం చుట్టారు. హోంబలే ఫిలింస్ నిర్మిస్తున్న ఈ చిత్రం అక్టోబర్ 2 గాంధీ జయంతి)న విడుదల కానుంది. సినిమాను కన్నడ, తెలుగు, తమిళ, మలయాళ, హిందీ, ఇంగ్లీష్, బెంగాలీ భాషల్లో రిలీజ్ చేయనున్నారు. ఇది కన్నడ ఫిల్మ్ ఇండస్ట్రీలోనే అతిపెద్ద రిలీజ్ అని పేర్కొంటున్నారు. ఈ ప్రీక్వెల్ సినిమాకు రిషబ్ శెట్టే దర్శకత్వం వహిస్తున్నారు. విజయ్ కిరగందూర్ నిర్మాణంలో 'కేజీఎఫ్', 'సలార్' వంటి భారీ సినిమాలను నిర్మించిన హోంబలే ఫిలింస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. సంగీతాన్ని అజనీష్ లోక్‌నాథ్ అందిస్తున్నారు.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.